# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 54 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 15 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 54 15-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




ప్రియాంకకి పదోన్నతి
కాంగ్రెస్ కసరత్తు

3లో..





# అకాల వర్షం.. అపార నష్టం..

- వడగండ్ల వానతో రైతన్నకు కడగండ్లు
- మార్కెట్లలో వరదలకు కొట్టుకుపోయిన ధాన్యం
- పంట నష్టంపై ప్రభుత్వం సర్వే..
- పరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులు
- ఈదురు గాలులు బీభత్సం..
- గోడకూలి వృద్ధురాలి దుర్మరణం

**అమరావతి ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీలో అన్నదాతలకు అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వర్షాలు, వడగండ్ల వానకు భారీగా పంట నష్టం వాటిల్లింది. ఈదురుగాలతో కూడిన వర్షంతో పంటలు నేలరాలాయి. చేతికొచ్చిన నేలకొరగడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రధానంగా మామిడి, బొబ్బాయి, మొక్కజొన్న పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు నియోజకవర్గంలో భారీ ఈదురు గాలులతో ఆకాల వర్షం పడటంతో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. పగలు ఎండ వేడి సాయంత్రం గాలి దుమ్ములతో ప్రజానీకం తీవ్ర అవస్థలు పడుతున్న పరిస్థితి. ఈదురు గాలులకు పలు చోట్ల భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. తిరువూరు పట్టణంలో గాలులకు హోర్డింగ్‌లు, కరెంటు స్థంబాలు నేలకొరిగాయి. తిరువూరు పట్టణంలో ఆదివారం రాత్రి నుంచి కరెంట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రాత్రి కురిసిన అకాల వర్షానికి తిరువూరు మార్కెట్ యార్డ్‌లో 1000కి పైగా ధాన్యం బస్తాలు తడిసిముద్దయ్యాయి. ఆరుగాలం కష్టంచి పండిన ధాన్యం తడవటంతో తీవ్ర నష్టం వాటిల్లింది అని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. తిరువూరు నియోజకవర్గంలో ఈదురు గాలుల బీభత్సం సృష్టించాయి. మామిడి, బొబ్బాయి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికొచ్చిన మొక్కజొన్న, బొబ్బాయి, మామిడికాయలు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టామని వరి పంట చేతికొచ్చిన


- తరువాయి 2లో..







## సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు పేదలను ఆదుకోవాలి



-ఏపీ సీఎం చంద్రబాబు -స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన కోసం కృషి
-అంబేద్కర్ స్ఫూర్తితో ఏపీలో సుపరిపాలన

**గుంటూరు ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

చరిత్రలో ఎప్పుడూ లేని సంక్షేమ పథకాలను ఏపీలో అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. గత వైసీపీ పాలకులు అమరావతిని ఎడారి అన్నారని మండిపడ్డారు. రాజధానిని ధ్వంసం చేసి పైశాచిక ఆనందం పొందారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాకతో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో భయానక పరిస్థితులు ఉన్నాయని సీఎం చంద్రబాబు ఆరోపించారు. గత ఎన్నికల్లో 94 శాతం కూటమి అభ్యర్థులు గెలిచారని గుర్తు చేశారు. మళ్లీ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని అన్నారు. నష్టపోయిన ఏపీని పునర్ నిర్మాణం చేస్తున్నామని అన్నారు. ఏపీలో సుపరిపాలన అందిస్తున్నాం.. పేదలకు అండగా నిలిచామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం

- తరువాయి 2లో..



## ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుల అసమాన ప్రతిభ

ప్రైవేటు కాలేజీలకు ధీటుగా మార్కుల సాధన
-ఇంటర్ లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు మంత్రి లోకేష్ సన్మానం
-నేడు మంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్న 52 మంది విద్యార్థులు

**అమరావతి ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రైవేటు ఇంటర్మీడియట్ కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ కాలేజీల్లో విద్యను అభ్యసించి అసమాన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్య శాఖ మంత్రి నారా లోకేష్ సన్మానించనున్నారు. 15వ తేదీ

- తరువాయి 2లో..



## ‘తల్లికి వందనం’ అమలుకు కసరత్తు

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ
రెండో దశ హామీలకు శ్రీకారం




**అమరావతి ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు దశలోకి తీసుకెళుతోంది. ఇప్పటికే ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రావడంతో, ఇప్పుడు మరో రెండు ముఖ్యమైన పథకాలు అమలుకు రంగం సిద్ధం చేస్తోంది. ‘తల్లికి వందనం’ మరియు ‘అన్నదాత సుఖీభవ’ పథకాలు ప్రజల జీవితాలను మార్చే విధంగా ఉండేలా మార్గదర్శకాలపై అధికారులు కసరత్తు

- తరువాయి 2లో..



## వక్ఫ్ రూల్స్‌ను కాంగ్రెస్ తమ స్వార్థానికి మార్చేసింది

అంత ప్రేమ ఉంటే ముస్లింలకు అధ్యక్ష పదవి ఎందుకు ఇవ్వలేదు
కాంగ్రెస్ పార్టీకి ప్రధాని మోదీ సూటి ప్రశ్న

**అమరావతి ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

: ముస్లింలపై అంత ప్రేముంటే పార్టీ అధ్యక్షుడి పదవి ముస్లింలకు ఎందుకు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో 50 శాతం టిక్కెట్లు వారికే ఇచ్చి, వారు గెలిచి ఉంటే తమ అభిప్రాయాలను

- తరువాయి 2లో..



## కోలుకుంటున్న కొడాలి నాని

నాని ఆరోగ్యంపై వైద్యుల కీలక ఆదేశాలు

**అమరావతి ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా నిలిచిన మాజీ మంత్రి, గుడివాడ నియోజకవర్గం ఎమ్మెల్యేగా సేవలందించిన కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు అలియాస్ కొడాలి నాని ఆరోగ్యం పై కీలక అప్డేట్ వెలుగులోకి వచ్చింది. గత కొన్ని రోజులుగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న నానికి, ఇటీవల ముంబైలో బైపాస్ శస్త్రచికిత్స నిర్వహించగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడుతోందని వైద్యులు ప్రకటించారు. ముంబైలోని ప్రసిద్ధి చెందిన ఆసుపత్రి ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్ లో దేశంలోనే పేరొందిన హార్ట్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండే నేతృత్వంలో ఈ బైపాస్ ఆపరేషన్‌ను నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స దాదాపు 8 గంటల పాటు కొనసాగింది. ఆపరేషన్ పూర్తయ్యాక నానిని ఐసీయూలో ఉంచి పర్యవేక్షణలో ఉంచారు. ప్రస్తుతం నానిని ఐసీయూ నుంచి సాధారణ గదికి మార్చినట్లు సమాచారం. కొడాలి నాని ఆరోగ్యం ప్రస్తుతం స్థిరంగా ఉందని, ఆపరేషన్ విజయవంతం అయిన అనంతరం క్రమంగా కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆస్పత్రిలోనే నానిని నెమ్మదిగా నడిపిస్తున్నట్లు వారు చెబుతున్నారు. తాము వీడియో కాల్ ద్వారా వైద్యుల నుంచి సమాచారం పొందుతున్నామని పేర్కొన్నారు. కుటుంబసభ్యులు, సన్నిహితులు ప్రస్తుతం ఆసుపత్రి పరిధిలోనే ఉన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్నారు. ఆయనే స్వయంగా వైద్యులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. అంతేకాకుండా, జగన్ సూచనల మేరకే నానిని ముంబైకి తరలించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం మేరకు, నాని డిశ్చార్జ్ విషయాన్ని జగన్‌కి అధికారికంగా తెలియజేశారు. నానిని పరామర్శించేందుకు పార్టీ కీలక నేత, మాజీ మంత్రి పేర్ని నాని ముంబైకి వెళ్లనున్నారు. కోలుకున్న కొడాలి నాని గుండె ఆపరేషన్ తరువాత కొడాలి నాని

- తరువాయి 2లో..



# సంపాదకీయం

## ఒక్క అడుగుతో పెద్ద మార్పు!

'పక్షులు మానవునికి జీవన గమనం నేర్పుతాయి. వాటిని కాపాడటం మన కర్తవ్యం' అంటారు భారతదేశ పక్షి శాస్త్ర పితామహుడు సలీం అలీ. జీవ పరిణామ క్రమంలో ఉద్భవించిన అద్భుత జంతుజాలమే పక్షులు. ఈ సృష్టిలో పక్షులది ఒక ప్రత్యేకమైన స్థానం. ప్రకృతికి అందాన్ని, మానవాళికి జీవవైవిధ్యంతో పాటు ఆనందాన్ని అందిస్తాయి. 'భూమిపై జీవితం యొక్క గొప్ప ఆనందాలలో పక్షుల గానం ఒకటి' అంటారు ప్రముఖ ప్రకృతి ప్రేమికుడు రాబర్ట్ లిండ్. వీటి జీవన విధానం మనిషికి సహనాన్ని, శ్రమను, స్వేచ్ఛను నేర్పుతాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకమైన పాత్ర పోషిస్తాయి. పక్షులు-పర్యావరణం మధ్య ఉన్న అవినాభావ సంబంధం మానవాళి మనుగడకు అత్యంత ముఖ్యమైనది. వ్యవసాయంలో కీలకమైన పాత్ర వహిస్తాయి. పంటలకు హానిచేసే, కీటకాలను, పురుగులను తినడం ద్వారా తెగుళ్లు రాకుండా పరోక్షంగా పంటలను రక్షిస్తాయి. పువ్వుల్లోని పుప్పొడిని ఒకచోటు నుండి మరోచోటుకు తీసుకువెళ్లి పునరుత్పత్తికి సహాయపడతాయి. విత్తనాలను వ్యాప్తి చేయడంలో సహాయపడటం ద్వారా అడవుల పెరుగుదలకు సహకరిస్తాయి. చనిపోయిన జంతువులను తినే రాబందు వంటి పక్షులైతే పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడంలోనూ సహాయపడతాయి. అందుకే-'పక్షులు వ్యవసాయానికి, పర్యావరణానికి సహజ మిత్రులు' అంటారు.

ఒక్క మాటలో చెప్పాలంటే, పక్షులు మానవాళికి అవసరమైన ఆహార గొలుసులో ముఖ్యమైన భాగంగా ఉంటూ పర్యావరణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్రాముఖ్యతను వివరిస్తూ 'ప్రతిదీ మరొకదానితో ముడిపడి ఉంది' అంటారు జాన్ ముయిర్. పర్యావరణంలోని ఈ సంక్లిష్టమైన సంబంధాలలో పక్షులు ఒక ముఖ్యమైన బంధం. పక్షులు, మూగజీవాలు కళ్ల ముందే చనిపోతున్నా పెద్దగా పట్టించుకోరు చాలామంది. కానీ, ఓ పక్షి ప్రాణాలు కాపాడేందుకు స్వయంగా జడ్జి, కలెక్టర్ రంగంలోకి దిగారు. కన్నూరు జిల్లా, ఉల్లిక్కల్ పంచాయతీ పరిధిలోని మూసేసిన ఓ టెక్స్‌టైల్ షాపు గ్లాస్ ప్యానెల్‌లో ఓ పక్షి చిక్కుకుంది. ఆ ప్యానెల్‌లో నుంచి బయట పడేందుకు శతవిధాలా ప్రయత్నిస్తుంది. కానీ సాధ్యం కాలేదు. పక్కనున్న షాపులవాళ్లు చూసినా కాపాడలేని పరిస్థితి. బిజినెస్ పార్ట్‌నర్స్ మధ్య ఏర్పడిన వివాదం కారణంగా ఆ షాపును కొన్ని నెలల క్రితం కోర్టు సీజ్ చేసింది. షాపు తెరవాలంటే, కోర్టు అనుమతి తీసుకోవాల్సిందే. ఇందుకోసం జిల్లా కలెక్టర్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా రంగంలోకి దిగారు. దీనిపై స్పందించిన జడ్జి%ొ% నేరుగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. షాపును తెరిపించి, మూడు రోజులపాటు గ్లాస్ ప్యానెల్‌లో చిక్కుకున్న పక్షిని ప్రాణాలతో కాపాడారు. ఆ పక్షి%ొ% స్వేచ్ఛగా గాల్లోకి ఎగిరిపోయింది.

అయితే, పక్షుల మనుగడ నేడు ప్రమాదంలో పడింది. ఈ ఒక్క పక్షినైతే రక్షించగలిగారు. కానీ, పట్టణీకరణ, అడవుల నిర్మూలన, కాలుష్యం, వ్యవసాయంలో రసాయనాల వినియోగం వల్ల పక్షుల ఆవాసాలు తగ్గిపోతున్నాయి. ఆహారం లభించక, విషపూరితమైన వాతావరణంలో జీవించలేక అనేక పక్షి జాతులు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. 'అభివృద్ధి క్రమం అంతా ప్రకృతి హక్కుల ఉల్లంఘనే' అంటారు పర్యావరణ కార్యకర్త సత్యశ్రీనివాస్. ఆధునిక సాంకేతికత అభివృద్ధి వల్ల పక్షుల మనుగడకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోంది. సెల్‌టవర్ల నుంచి వచ్చే రేడియో తరంగాలు వీటిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పక్షుల సంఖ్య తగ్గిపోవడం కేవలం ప్రకృతికి జరిగే నష్టం మాత్రమే కాదు, ఇది మానవాళి మనుగడకు కూడా పెను ముప్పుగా మారుతున్నది. పక్షులు, పర్యావరణం మనకు వారసత్వంగా లభించిన సంపద. ఈ సంపదను కాపాడుకోవడం ద్వారానే భవిష్యత్తరాలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించగలం. 'పక్షులను కాపాడటం అంటే, ప్రకృతిని కాపాడటం. ప్రకృతి లేని జీవితం అసంభవం' అని ఎల్డో లియోఫోల్డ్ అంటారు. చిన్నచిన్న చర్యలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నట్లుగా%ొ%కలెక్టర్, జడ్జి మాదిరిగా, పర్యావరణ పరిరక్షణకు మనం వేసే ఒక్క అడుగే పెద్ద మార్పునకు దారితీస్తుంది.



## అకాల వర్షం.. అపార నష్టం..

సమయంలో పంట నష్టం జరగడంతో తీవ్రంగా నష్టపోయామని రైతుల ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి తమకు నష్ట పరిహారం అందచేయాలని రైతులు కోరుతున్నారు. ఇటు తెలంగాణలోనూ రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. అకాల వర్షాలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వరంగల్, జనగామ, సమీప గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షాని వడగళ్ల వాన ధాటికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధానంగా మామిడి రైతులు అయితే తీవ్రంగా నష్టపోయారు.

**ఈదురు గాలులు బీభత్సం..గోడకూలి వృద్ధురాలి దుర్మరణం**

**- పలు ప్రాంతాల్లో వడగళ్ల వాన**

జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం భీకర గాలులు వీచాయి. ఆ ధాటికి పలు ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. పట్టణ ప్రాంతాల్లో హోర్డింగ్లు విరిగి పడ్డాయి. దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. రాత్రి పదకొండు గంటల వరకు సిబ్బంది సహాయక చర్యలు కొనసాగించి సరఫరా పునరుద్ధరించారు. కనిగిరి, పొదిలి తదితర ప్రాంతాల్లో వడగళ్ల వాన పడింది.కనిగిరి పట్టణం శంకవరానికి చెందిన డబ్బుకొట్టు వెంకటలక్ష్మమ్మ (56)పశువుల మేత కోసం వెళ్తుండగా... ఈదురు గాలులు, వడగళ్ల వాన ప్రారంభమైంది. దీంతో ఆ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న గోడ పక్కన తలదాచుకున్నారు. భారీ గాలులకు అది ఒక్కసారిగా కూలి... సిమెంట్ ఇటుకలు పైన పడడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఎస్సై శ్రీరామ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.రైతుకు తీరని నష్టం: కోత దశలో ఉన్న పొగాకు, శనగ, మిరప, మినుము, వరి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. రేకల్లో ఉన్న పొగాకు, నూర్పిడి దశలో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయాయి. ఒక్కసారిగా గాలీవర్షం కమ్ముకురావడంతో పట్టలు కప్పేందుకూ అవకాశం లేకపోయిందని రైతులు వాపోయారు.మండలాల వారీగా కనిగిరిలో 43.0 మి.మీ., రుద్రసముద్రం (దొనకొండ) 25.5, పొదిలి 23,5, పీసీపల్లి 23,0, ముండ్లమూరు 21.0, దర్శి 13.2, సింగరాయకొండలో 11.7 మి.మీ చొప్పున అత్యధిక వర్షపాతం నమోదైంది.

**పంట నష్టంపై ప్రభుత్వం సర్వే.. పరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులు**

రాష్ట్రంలో అకాల వర్షాలు, వడగళ్ల వానలు అన్నదాతలను తీవ్రంగా కలవరపెడుతున్నాయి. చేతికి అందివచ్చిన పంట నేలపాలవుతోంది. మార్కెట్లకు తీసుకొచ్చిన ధాన్యం వరదల్లో కొట్టుకుపోయింది. కోతకు వచ్చిన పంటను వడగళ్ల వాన దెబ్బతీసింది. ఆదివారం కురిసిన వర్షాలకు తెలంగాణలోని జనగామ, సిద్దిపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు పది వేలకు పైగా ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో మామిడికాయలు, ధాన్యం గింజలు రాలిపోయాయి. గత నెల చివరి వారం నుంచి రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ వర్షాల కారణంగా దాదాపు 50 వేలకు పైగా ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక సమర్పించింది. రాష్ట్రవ్యాప్తంగా మార్చి నెలాఖరు నుంచి ఈ నెల 2 వరకు కురిసిన వర్షాల కారణంగా 8 వేలకు పైగా ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని పేర్కొంది. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 2 తర్వాత కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలకు సంబంధించి అధికారులు ప్రస్తుతం సర్వే చేస్తున్నారు. ఈ నివేదిక అందాక ఈ నెల 25న పరిహారం ప్రకటించే అవకాశం ఉంది. కాగా, ఈ నెలాఖరు వరకు వానలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు వరి కోతలను వాయిదా వేస్తున్నారు.

## సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు పేదలను ఆదుకోవాలి



గుంటూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లాలోని పొన్నెకల్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. అందరం స్వేచ్ఛగా ఉన్నామంటే అంబేద్కర్ అందించిన రాజ్యాంగమే కారణమని సీఎం చంద్రబాబు అన్నారు. 2019-24 మధ్య ప్రజలు ఆనందంగా ఉన్న రోజులే లేవని చెప్పారు. తనలాంటి వాళ్లు కూడా బయటకు రాలేని పరిస్థితి ఉందని అన్నారు. విద్యార్థులు కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలని సూచించారు. అప్పుడే ఉన్నత లక్ష్యాలకు చేరుకోగలరని సీఎం చంద్రబాబు అన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో అందరూ నడవాలని సూచించారు. మనందరికీ హక్కులు ఉన్నాయంటే అంబేద్కరే కారణమని సీఎం చంద్రబాబు అన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అంబేద్కర్ అని అభివర్ణించారు. దళితులకు 8 లక్షల ఎకరాలు పంచిన ఏకైక పార్టీ టీడీపీనేనని ఉద్ఘాటించారు. దళితులకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మాటిచ్చారు. రెసిడెన్షియల్ స్కూల్స్ ఆలోచన చేసింది ఎన్టీఆరేనని గుర్తుచేశారు. అంబేద్కర్ ఓవర్సీస్ పథకంలో ఎస్సీ, ఎస్టీ పిల్లలకు ఉచిత విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రతిష్టాత్మక వర్సిటీలు అమరావతికి తరలి వస్తున్నాయని అన్నారు. సబ్ ప్లాన్ ద్వారా దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో మెరుగైన భోజనం, నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. దళితులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణల ద్వారా అభివృద్ధి సాధ్యమని అన్నారు. గతంలో ఐటీ గురించి మాట్లాడితే ఎగతాళి చేశారని చెప్పారు. ఇప్పుడు ఐటీలో మనమే నెంబర్ వన్‌గా ఉన్నామని తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ తయారు చేశామని అన్నారు. ప్రపంచంలోనే తెలుగుజాతి నెంబర్ వన్‌గా ఉంటుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు పేదలను ఆదుకోవాలని చెప్పారు. అందుకే పీ4 కార్యక్రమం మొదలు పెట్టామని అన్నారు. విజన్ 2047 ద్వారా స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో తెలుగు వారు ఉన్నారని అన్నారు. చాలా చోట్ల అత్యధిక సంపాదన తెలుగు వారిదేనని సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రవాసాంధ్రులు రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని అన్నారు. మార్గదర్శి బంగారు కుటుంబంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో మన దేశంలో మౌలిక వసతులు చాలా వచ్చాయన్నారు. అందుకే ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా పేదరిక నిర్మూలన కోసం పీ4 తెచ్చామని గుర్తుచేశారు. ప్రైవేటు భాగస్వామ్యంతో పేదల జీవితాలు మార్చడం కోసం పని చేస్తున్నామని అన్నారు. పొన్నెకల్లు గ్రామంలో ఇంకా 300 మందికి ఇంకా మరుగుదొడ్లు లేవని తెలిపారు. ఆరు నెలల్లో వారందరికి మరుగుదొడ్లను తమ ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. పొన్నెకల్లు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. 24 ఇళ్లల్లో ఇంకా విద్యుత్ సౌకర్యం లేదని.. ఆ ఇళ్లల్లో వెంటనే సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుల అసమాన ప్రతిభ

మధ్యాహ్నం 2 గం.లకు ఉండవల్లి నివాసంలో జరగనున్న జరగనున్న సన్మాన కార్యక్రమంలో ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డులు అందజేయనున్నారు. వారితో కలిసి మంత్రి లోకేష్ ముఖాముఖి నిర్వహించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రైవేటు కాలేజీల మాదిరిగా అభినందించి, ప్రోత్సహిస్తామని విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేయడం జరిగింది. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ఒకేషనల్ కాలేజీల్లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించనున్నారు. విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, కస్తూరిభా గాంధీ బాలికా విద్యాలయాలు(కేజీబీవీ), ఏపీఆర్ జేసీ, ఆదర్శ పాఠశాలలు, హైస్కూల్ ప్లస్ లలో ఎంపీసీ, బైపీపీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎమ్ఈసీ గ్రూప్ ల్లో అత్యధిక మార్కులు సాధించిన 28 మంది విద్యార్థులతో పాటు ప్రభుత్వ వృత్తి విద్యా కాలేజీల్లో వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 24 మంది విద్యార్థులు కలిపి మొత్తం 52 మంది టాప్ మార్కులు సాధించిన విద్యార్థులను మంత్రి లోకేష్ అభినందించనున్నారు. వీరిలో 6గురు విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారు. అత్యుత్తమ మార్కులు పొందిన 52 మందిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివిన విద్యార్థులు 29 మంది ఉండగా, కేజీబీవీలకు చెందిన విద్యార్థులు ఏడుగురు, ఏపీఆర్ జేసీకి చెందిన వారు ఏడుగురు, ఆదర్శ పాఠశాలలకు చెందిన వారు ఆరుగురు, హైస్కూల్ ప్లస్ లలో చదివి టాప్ మార్కులు సాధించిన విద్యార్థులు ముగ్గురు ఉన్నారు. ప్రైవేటు కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలను తీర్చిదిద్దుతామని మంత్రి నారా లోకేష్ ఇప్పటికే స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంటర్ లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనితీరులో గణనీయమైన మార్పు వచ్చింది. ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనం. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగింది. ఇంటర్మీడియట్ రెండో ఏడాదిలో అత్యధికంగా 69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాదిలో గత పదేళ్లతో పోలిస్తే రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. అత్యధికంగా 47 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ లోనూ గత పదేళ్లతో పోలిస్తే రికార్డు స్థాయిలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ మొదటి ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 64శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ రెండో ఏడాదిలో గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో అత్యధికంగా 82శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇంటర్ తోనే విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు వృత్తివిద్యను బలోపేతం చేశారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంటర్ విద్య బలోపేతానికి చర్యలు తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ఐదేళ్ల తర్వాత 2024 ఏడాదిలో 217 మంది ప్రిన్సిపల్స్ కు ప్రమోషన్లు ఇవ్వడం జరిగింది. 2024 ఏడాది అక్టోబర్ నుంచి సెంట్రలైజ్డ్ అసెస్ మెంట్ చేయడం జరిగింది. అంతర్గత పరీక్షల్లో విద్యార్థుల ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించడం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల పనివేళల్లో మార్పు, వెనుకబడిన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. టేక్ కేర్ వ్యవస్థను ఏర్పాటుచేయడం జరిగింది. ఆయా సంస్కరణల ఫలితంగా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది.

## 'తల్లికి వందనం' అమలుకు కసరత్తు

చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన "సూపర్ సిక్స్"లో భాగంగా ఈ రెండు పథకాలను అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకున్నారు. "తల్లికి వందనం" పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు నేరుగా జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే మే నెలలో ఈ నిధులు జమ కానున్నాయని స్పష్టమైంది. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే, అంతమందికి నిధులు అందుతాయని చెప్పడం ఈ పథకం విశిష్టత. గత ప్రభుత్వంలో ఏడాదికి రూ.5,540 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం ప్రభుత్వం రూ.9,407 కోట్లు కేటాయించడం గమనార్హం. ఇది 50 శాతం అధికం కావడం ఈ పథకానికి ఉన్న ప్రాధాన్యతను సూచిస్తోంది. పథకానికి అర్హతలు ఎలా ఉంటాయన్న దానిపై ఇంకా అధికారిక స్పష్టత రాలేదు. గతంలో వైసీపీ ప్రభుత్వం 75 శాతం హాజరును తప్పనిసరిగా పేర్కొనగా, ప్రస్తుతం ప్రభుత్వం అదే నిబంధనను కొనసాగించనుందనే సంకేతాలు వస్తున్నాయి. విద్యుత్ వినియోగం, కార్ కలిగి ఉండటం, తెల్ల రేషన్ కార్డు లేకపోవడం వంటి పాత నిబంధనలను ప్రస్తుతం సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా పాత మార్గదర్శకాల్లో ఉన్న ఆదాయ పన్ను చెల్లింపుదారుల తొలగింపు వంటివి కొనసాగిస్తారా లేక మినహాయింపు ఇస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. అధికార యంత్రాంగం ప్రస్తుతం వీటిపై కసరత్తు చేస్తుండగా, త్వరలోనే అధికారికంగా మార్గదర్శకాలు ఖరారవుతాయి. "తల్లికి వందనం"తో పాటుగా రైతుల కోసం "అన్నదాత సుఖీభవ" పథకానికి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఈ పథకానికి సంబంధించి కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చించి మార్గదర్శకాలు ఖరారు చేయనున్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా తీసుకున్న ఈ పథకం ద్వారా వ్యవసాయ కుటుంబాలకు ప్రత్యక్ష మద్దతు ఇవ్వనున్నది. మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు %-% ప్రజల్లో ఆసక్తి పెరిగింది ఈ నెల 15న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ఈ రెండు పథకాల అమలుకు సంబంధించి నిర్ణయాలు తీసుకోనున్నారు. పాలనాపరంగా ప్రభుత్వ ప్రతిష్మాత్మకంగా తీసుకున్న ఈ చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వేగంగా ముందుకెళ్తోంది. అదే సమయంలో అర్హతలపై స్పష్టత కోసం ఎదురు చూస్తున్న ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది.

## వక్ఫ్ రూల్స్‌ను కాంగ్రెస్ తమ స్వార్థానికి మార్చేసింది

చట్టసభల్లో వారు వ్యక్తం చేసి ఉండేవారు కదా అని నిలదీశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ వైఖరిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. ముస్లిం ఛాందసవాదులను బుజ్జగించడం మాత్రమే కాంగ్రెస్‌కు తెలుసునని, కొత్త చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ స్వప్రయోజనాల కోసం వక్ఫ్ చట్టంలోని రూల్స్‌ను మార్చేసిందని ఆయన ఆరోపించారు. వక్ఫ్ ప్రాపర్టీగా లక్షలాది హెకార్టులు ఉన్నాయని మోదీ చెప్పారు. "వక్ఫ్ ఆస్తులను నిజాయితీగా ఉపయోగిస్తే ముస్లిం యువత బతకుతెరువు కోసం సైకిల్ పంక్చర్లు వేసుకోవాల్సి అవసరం లేదు. ఈ ఆస్తుల వల్ల కొందరు ల్యాండ్ మాఫియా మాత్రమే లబ్ధి పొందుతున్నారు. ఈ మాఫియా దళితులు, వెనుకబడిన వర్గాలు, వితంతువుల భూములు లూటీ చేస్తున్నారు. వక్ఫ్ చట్టంలో మార్పుల తర్వాత పేదల భూముల లూటీలు ఆగిపోతాయి. కొత్త వక్ఫ్ చట్టంతో గిరిజనులకు చెందిన భూముల జోలికి వక్ఫ్ బోర్డు వెళ్లలేదు. పేద ముస్లింలు, పస్మాండ ముస్లింలు తమ హక్కులను పొందగలుతారు. ఇదే నిజమైన సామాజిక న్యాయం" అని మోదీ అన్నారు. హర్యానాలోని హిస్సార్ విమానాశ్రయాన్ని ప్రధానమంత్రి సోమవారంనాడు ప్రారంభించారు. రాష్ట్ర అభివృద్ధి జర్నీలో ఈ విమానశ్రయం ఒక మైలురాయి కానుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. డాక్టర్ బీఆర్ అబేంద్కర్ జయంత్యుత్సవాన్ని స్మరించుకుంటూ, అంబేద్కర్ పాటించిన విధానాలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తినిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఆశయాలకు అనుగుణంగా ఉంటున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం రాజ్యాంగాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటోందని విమర్శించారు. ఎమర్జెన్సీ సమయంలో అధికారం నిలబెట్టుకునేందుకు రాజ్యాంగానికి పాతర వేసిందని, రాజ్యాంగం సెక్యులర్ సివిల్ కోడ్ గురించి చెబితే కాంగ్రెస్ దానిని ఎప్పుడూ అమలు చేసిందే లేదని అన్నారు. ఈరోజు ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తున్నామని అన్నారు. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ దీనిని వ్యతిరేకిస్తోందన్నారు. రిజర్వేషన్ ప్రయోజనాలను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చేరుతున్నాయా అనేది కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకున్నా పాపాన లేదని మోదీ విమర్శించారు. అంబేద్కర్ జీవించి ఉండగా ఆయనను కాంగ్రెస్ పదేపదే అవమానించిందని చెప్పారు. రెండుసార్లు ఆయన ఓడిపోయేలా చేసిందని అన్నారు. అంబేద్కర్ మరణం తర్వాత కూడా ఆయన జ్ఞాపకాలు చెరిపేసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. సమానత్వం కోసం బాబా సాహెబ్ పాటుపడితే, కాంగ్రెస్ ఓట్ బ్యాంకు వైరస్‌ను వ్యాప్తి చేసిందన్నారు. మతప్రాతిపదికన రిజర్వేషన్లకు అంబేద్కర్ వ్యతిరేకమని, కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలతో ముస్లింలకు కూడా నష్టమే జరుగుతోందన్నారు. కొంతమంది ఛాందసవాదులు సంతోషంగా ఉండేలా చేయడం వల్ల సమానంలోని తక్కిన వారంతా నిరక్షరాస్యులుగా, పేదలుగా మిగిలిపోతారని, వక్ఫ్ చట్టంపై కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానమే అందుకు అతిపెద్ద నిదర్శనమని విమర్శించారు.

## కోలుకుంటున్న కొడాల నాని

ఆరోగ్యం నిలకడగా ఉంది. సర్జరీ తరువాత పూర్తిగా వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ఐసీయూ నుంచి సాధారణ రూమ్ కు తరలించారు. కొడాలి నాని తిరిగి కోలుకుంటున్నట్లు వైద్యులు వెల్లడించారు. ఆస్పత్రిలోనే నెమ్మదిగా నడిపించినట్లు నాని కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. కొడాలి నాని ఈ నెల 19 లేదా 20న ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. తిరిగి హైదరాబాద్ లోని ఏజీఐ లో భవిష్యత్ చికిత్స తీసుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుతం కొడాలి నాని కోలుకోవటంతో మరి కొంత కాలం హైదరాబాద్ లోనే ఉండనున్నారు. వచ్చే నెల మరోసారి ముంబాయి ఆస్పత్రిలో చెకప్ కోసం వెళ్లాల్సి ఉంటుందని తెలుస్తోంది. డిశ్చార్జ్ అనంతరం కొడాలి నాని పూర్తిగా రాజకీయాలకు విరామం తీసుకోవాల్సిందేనని వైద్యులు స్పష్టం చేశారు. ఫిజికల్, మెంటల్ రెస్ట్ అవసరమని పేర్కొన్నారు. పార్టీ నేతలు కూడా ఈ విషయం మీద స్పష్టత ఇచ్చారు. త్వరగా కోలుకున్న తర్వాతే తిరిగి

## అనకాపల్లి ప్రమాద ఘటన..

# మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి



అనకాపల్లి, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా పేలుడు ఘటనలో మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయ్యింది. నర్సీపట్నం ప్రభుత్వాసుపత్రిలో ఆరు, అనకాపల్లి ప్రభుత్వాసుపత్రిలో రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు.**

అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఇక, ఈ ప్రమాదంలో క్షతగాత్రులకు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో గాయపడిన 8 మందిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రుల్లో ఇద్దరికి నర్సీపట్నం ఆసుపత్రిలో, నలుగురికి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. ఇద్దరి పరిస్థితి విషమించడంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. కైలాసపట్నం బాణసంచా పరిశ్రమ వద్ద అగ్నిమాపక సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఇంకా ఏమైనా బాణసంచా సామగ్రి మిగిలిపోయిందేమోనని పరిశీలించారు. అక్కడక్కడ చిన్నగా వస్తున్న పొగలను సిబ్బంది ఆర్పారు. మిగిలిపోయిన బాణసంచాను భూమిలో పాతిపెట్టేందుకు ఏర్పాట్లు చేశారు.

## గత ప్రభుత్వ హయాంలో గోశాలలోకి

# విజిలెన్స్ వాళ్లనూ అనుమతించలేదు

## తితిదే ఈవో శ్యామలరావు

**తిరుమల: గత ప్రభుత్వ హయాంలో గోవులు తాగే నీళ్లు నాచు పట్టేసినా పట్టించుకోలేదని తితిదే ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.**

తిరుమల, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



"నాచు పట్టేసిన నీళ్లను గోవులకు పట్టించారు. పురుగులు పట్టేసి వినియోగించుకోలేని నీళ్లు పట్టిస్తారా? విజిలెన్స్ వాళ్లు వెళ్లేందుకు కూడా గతంలో అనుమతించలేదు. హిందువుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశంపై చాలా జాగ్రత్తగా ఉండాలి కదా? గోశాల ఆవరణలో చెల్లాచెదురుగా మెడిసిన్స్ పడేశారు. మార్చి 2021 నుంచి మార్చి 2024 వరకు భారీగా అక్రమాలు జరిగాయి. గత ఐదేళ్లలో చనిపోయిన ఆవుల వివరాలు దాచిపెట్టారు. ఆవులు లేని గోశాలకు దాణా పేరుతో నిధులు దుర్వినియోగం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తితిదే ఐటీ విభాగంలో ఉన్నతస్థాయి అధికారి నియామకంలో నిబంధనలు గాలికొదిలేశారు. జీఎం స్థాయి అధికారి నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డారు. ఐటీ విభాగం వైఫల్యంతో భారీగా అక్రమాలు జరిగాయి. ఒక దళారి 50 సార్లు ఆర్జిత సేవల టికెట్ పొందారు. ఆవు నెయ్యి కొనుగోలులో అక్రమాలు చోటు చేసుకున్నాయి. అన్న ప్రసాదంలో నాణ్యత లోపించింది. స్వామివారికి ఆర్గానిక్ ప్రసాదాల పేరుతో పలు అక్రమాలు చేశారు. రూ.3 కోట్ల విలువైన సరకులకు రూ.25 కోట్లు చెల్లించారు. జూన్ 2024లో ఈవోగా బాధ్యతలు తీసుకునే ముందు సీఎం చంద్రబాబును కలిశా. తితిదేలో వ్యవస్థలు పాడయ్యాయి.. వాటిని సరిచేయాలని ఆయన చెప్పారు. పది నెలల్లో ఎన్నో ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టాం. భక్తుల మనోభావాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరిచాం." అని ఈవో శ్యామలరావు తెలిపారు.

## జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కే.వీ. సత్యనారాయణ....

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



తూర్పుగోదావరి జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీగా 1991 బ్యాచ్ కు చెందిన కె.వి సత్యనారాయణ ఈరోజు ఉదయం రాజమహేంద్రవరంలోని మహిళా పోలీస్‌స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. వివాద రహితుడుగా పేరు ఉన్న డిఎస్పి కేవీ సత్యనారాయణ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పనిచేసి, కాకినాడ ట్రాఫిక్ డిఎస్పీగా, రాజమహేంద్రవరం ఎస్.బి డిఎస్పీగా, ఏలూరు మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీగా, అనంతరం పరవాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా విధులు నిర్వర్తించి, డిపార్ట్మెంట్లోనూ ప్రజల నుంచి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం నందు విధులు నిర్వహిస్తుండగా సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ కు బదిలి అవ్వడంతో ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశానుసారం జిల్లా అంతా మహిళలకు అవగాహన కల్పించి శక్తి యాప్ను ఇన్స్టాల్ చేసి మహిళలకు రక్షణ విషయంలో రాజీ పడకుండా వ్యవహరిస్తామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది సత్యనారాయణకు స్వాగతం పలికారు.

# ప్రియాంకకి పదోన్నతి : కాంగ్రెస్ కసరత్తు

న్యూఢిల్లీ ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున సంస్థాగత మార్పులకు సిద్ధమవుతోంది. అహ్మదాబాద్‌లో ఇటీవల ముగిసిన సీడబ్ల్యూసీ సమావేశం, ఏఐసీసీ ప్లీనరీలో ఈ మేరకు చాలా స్పష్టమైన సందేశాలు ఇచ్చింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కీలక మార్పులకు కసరత్తు చేస్తోంది. పార్టీ కోసం పనిచేసే వాళ్లు ఉండొచ్చు, ఇష్టం లేని వాళ్లు రిటైర్ కావచ్చు.. అంటూ మల్లికార్జున్ ఖర్గే అహ్మదాబాద్ ప్లీనరీలో స్పష్టమైన హెచ్చరికలు సైతం చేశారు. పార్టీ సంస్థాగత మార్పుల్లో భాగంగా కాంగ్రెస్ వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఎలాంటి కీలక పాత్ర అప్పగించనున్నారనే దానిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. దీనిపై పార్టీ త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పార్టీ అంతర్గత చర్చల్లో దీనిపై ప్రధానంగా చర్చ జరుగుతోందని, పార్టీ ఉపాధ్యక్ష పదవికి ప్రియాంకను ప్రమోట్ చేసే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రియాంక గాంధీ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పటికీ నిర్దిష్ట బాధ్యతలు లేవు. అయితే ఇటీవల జిల్లా అధ్యక్షులకు పార్టీలో కీలక పాత్ర ఉంటుందని ఖర్గే ప్రకటించారు. ఇందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించడం వెనుక ప్రియాంక గాంధీ కీలక పాత్ర పోషించారు. జిల్లా అధ్యక్షులకు కాంగ్రెస్ పార్టీ కీలక అధికారాలు అప్పగించాలని నిర్ణయం గుజరాత్‌తోనే ప్రారంభిస్తోంది. జిల్లా స్థాయి నేతలకు అధికారుల ఇవ్వడం ద్వారా పార్టీ అట్టడుగు స్థాయి నుంచి బలపడుతుందని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ ప్రాజెక్టు గుజరాత్‌లో విజయవంతమైతే ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించాలనే ఆలోచన పార్టీ అధిష్ఠానం ఉంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రియాంకకు కీలక బాధ్యతలు అప్పగించడంతో పాటు విస్తృతమైన సంస్థాగత మార్పులపై అధిష్ఠానం ముమ్మర కసరత్తు చేస్తోంది. పార్టీ అంతర్గత వ్యవస్థ, నిర్వహణా సామర్థ్యాన్ని పెంచుకోవాలని, తద్వారా పార్టీ మరింత సమర్థవంతంగా పనిచేసి భవిష్యత్ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతుందని అధిష్ఠానం భావస్తోంది. ప్రియాంక గాంధీకి ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారనే దానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోనప్పటికీ, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి దిశానిర్దేశం చేయడంలో ప్రియాంక కీలకంగా వ్యవహరించనున్నట్టు చెబుతున్నారు.

## తితిదే ఎస్వీ అన్నదానం ట్రస్ట్‌కు పవన్ సతీమణి

# విరాళం

తిరుమల, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తితిదే ఎస్వీ అన్నదానం ట్రస్ట్‌కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా విరాళం ఇచ్చారు. తమ కుమారుడు మార్క్ శంకర్ పేరుతో రూ.17లక్షల చెక్కును అధికారులకు అందజేశారు. నేటి మధ్యాహ్నం అన్నవితరణకు అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చారు. సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని అన్నా లెజినోవా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.






## కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసిన ఎంపీ మాగుంట

ఒంగోలు ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కేంద్ర హెూం శాఖ మంత్రి అమిషాను ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా ఢిల్లీలోని అమిత్ షా కార్యాలయంలో కలిశారు ఈ సందర్భంగా ఒంగోలు మండలంలోని గుండాయపాలెం లోని బకింగ్ హెూమ్ కెనాల్ పై 17 కోట్ల రూపాయలతో రోడ్డు మరియు బ్రిడ్జి నిర్మించవలసిందిగా విన్నవించారు అదేవిధంగా ప్రకాశం జిల్లాలోని వెనుకబడిన ప్రాంతమైన పశ్చిమ ప్రకాశంలోని ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలో అక్కడ ఉన్న దుర్భిక్ష కరువు ప్రాంతంపై దృష్టి సారించి ప్రత్యేక నిధులు కేటాయించవలసిందిగా కోరారు ఒంగోలు నియోజకవర్గంలోని పలు అంశాలపై కేంద్ర మంత్రి అమిత్ షా కు పూర్తిస్థాయి వివరాలుతో ఒక విజ్ఞాపన పత్రం అందజేసినట్లు ఎంపీ మాగుంట కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షాను ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి దృశ్యాలువతో సన్మానించారు.

## రాష్ట్రానికి ఆదర్శవంతమైన

# అంబేద్కర్ భవన్ బందరులో నిర్మిస్తాం

## -అంబేద్కర్ జయంతి వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని చాటి చెప్పిన అంబేద్కర్ స్ఫూర్తితో మచిలీపట్నంలో అత్యుత్తమ అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డా. అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ "బడుగు, బలహీన వర్గాలకు స్వేచ్ఛనిచ్చిన మహనీయుడు అంబేద్కర్. గతంలో కృష్ణా జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించి, పనులు ప్రారంభించినా.. తర్వాత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా భవనం మొత్తం నాశనమైపోయింది. రూ.22 కోట్లతో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారని, త్వరలోనే జీవో రాబోతోందన్నారు. పార్కింగ్, కమ్యూనిటీ హాల్, సమావేశం గదులు, అధికారులకు, విద్యార్థులకు వసతి సదుపాయాలు కల్పించడం ద్వారా రాష్ట్రంలోనే అత్యుత్తమమైన అంబేద్కర్ భవన్ మచిలీపట్నంలో ఉందనేలా తీర్చిదిద్దుతామని" అన్నారు. "దేశానికి అత్యుత్తమ రాజ్యాంగం అందించిన అంబేద్కర్ ని దేశంలోని ప్రతి పౌరుడూ స్మరించుకోవాలి. మనం స్వేచ్ఛగా జీవించడానికి కారణం అంబేద్కర్. స్వాతంత్ర్యం



సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తైనప్పటికీ.. కొన్ని ప్రాంతాల్లో, కొన్ని వర్గాల్లో ఇంకా వెనుకబాటుతనం ఉంది. వారిని కూడా ముందుకు నడిపించేలా ప్రభుత్వాలు సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి. సబ్ ప్లాన్ నిధుల వినియోగం నుండి, బడ్జెట్ కేటాయింపులు, రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ల అమలు చేస్తున్నది. బడుగు బలహీన వర్గాల వారిని సొంత కాళ్లపై నిలబెట్టడం ద్వారా మాత్రమే ఆర్థిక స్వాతంత్ర్యం సాధ్యమవుతుంది. గత ఐదు సంవత్సరాలు కార్పొరేషన్ల ద్వారా రూపాయి బడ్జెట్ కూడా ఖర్చు చేయకుండా దగా చేశారు. కానీ, నేడు మళ్లీ నిధులు కేటాయించాం. గతంలో సబ్సిడీ తీసుకుని యూనిట్ పెట్టలేదు. ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో ముందుకు వెళ్తోంది. ప్రభుత్వం అందించే సబ్సిడీలను వినియోగించుకుని యువత స్వయం ఉపాధి పొందాలన్నదే లక్ష్యం. అవసరమైన స్కిల్ డెవలప్మెంట్ కూడా అందించి యూనిట్లను ఏర్పాటు చేయించబోతున్నాం. చేప ముక్క అందించడం కాదు.. చేపల్ని పట్టడం నేర్పిస్తే వారి కాళ్లపై వారు నిలబడతారని బలంగా నమ్ముతున్నాం. చంద్రబాబు డ్వాక్రా గ్రూపుల్ని ప్రారంభించి రాష్ట్ర మహిళల్ని దేశానికి, రాష్ట్రానికి ఆర్థిక మూలస్తంభంగా మార్చారు. బ్యాంకర్లు కూడా డ్వాక్రా సంఘాలకు రుణాలివ్వడానికి ఆసక్తి చూపుతున్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం నడుచుకుంటోందని, బడుగు బలహీనవర్గాలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వేచ్ఛ కల్పించేలా అడుగులు వేస్తున్నాం" అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.






తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
మంగళవారం15 ఏప్రిల్ 2025

# నవ భారతానికి దిక్సూచి డాక్టర్ అంబేద్కర్

## ఎమ్మెల్యే ఆనందరావు

**అమలాపురం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భారతదేశంలో ప్రజాస్వామ్య విధానాలకు నాంది పలికి నవభారత రాజ్యాంగం రచించి ప్రతి మనిషికి హక్కులు కల్పించిన ప్రపంచ మేధావి డాక్టర్ అంబేద్కర్ ఆధునిక భారతదేశానికి దిక్సూచి అని ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని ఆయన ఆశయాలు ముందుకు తీసుకువెళ్లాలని అమలాపురం శాసనసభ్యులు ఆనందరావు పిలుపునిస్తూ డాక్టర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు డాక్టర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా సోమవారం గడియార స్తంభం సెంటర్లో దళిత ఐక్యవేదిక చైర్మన్ డి బి లోక్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ తన కుటుంబాన్ని జీవితాన్ని పణంగా పెట్టి దేశం కోసం దేశ ప్రజల కోసం ముఖ్యంగా దళితులు అణగారిన వర్గాల కోసం వారి హక్కుల సాధనకై కృషిచేసి భారత రాజ్యాంగాన్ని రచించారని అందులో అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించారని తెలిపారు ఆయన సేవలు కండాంతరాలు దాటి ప్రపంచ దేశాలన్నీ ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆదర్శాలతో పనిచేస్తున్నాయని ప్రపంచ విజ్ఞానపు గనిగా ఆయనను గుర్తించి వరల్డ్ సింబల్ ఆఫ్ నాలెడ్జిగా కీర్తి ప్రతిష్టలు చేకూర్చాయని కావున అలాంటి మహనీయులు ఆశయాలకు అనుగుణంగా ఈ దేశ ప్రజలందరూ ముందుకు నడవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మెట్ల రమణబాబు, అల్లాడ సోంబాబు, దళిత ఐక్యవేదిక నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబురావు రేవు తిరుపతిరావు, కల్వకొలను తాతాజీ, విప్పర్తి రమణ ముత్తా బత్తుల శ్రీను,కొండేపూడి రవి కుంచే ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా అంబేద్కర్ జయంతి

**అమలాపురం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బి.ఆర్ అంబేద్కర్ 134 వ జయంతి %ఖీతీఖఅష్ట్రఅంవ% అమలాపురంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్లో, నల్లవంతెన ఎన్టీఆర్ మార్గ్ లో గల అంబేద్కర్ విగ్రహానికి శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యకమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడ ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టిడిపి నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, అధికారి జయవేంకటలక్ష్మి, కర్రి దత్తుడు, జనసేన నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కవులు సామాజిక చైతన్యంతో కవిత్వం రాయాలి

## శ్రీశ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్

**అమలాపురం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కవులు సామాజిక చైతన్యంతో, అభ్యుదయ భావాలతో కవిత్వం రాయాలని, కవులకు కళాకారులకు సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక అక్షర తపస్వి డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. అమలాపురంలో శ్రీశ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నిర్వహణ సారధ్యంలో అత్యంత వైభవంగా జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. సామాజిక అభివృద్ధికి సహాయపడే సాహిత్యం అంతా అభ్యుదయ సాహిత్యం అవుతుందని ఆయన అన్నారు. కవి కవితలోని భావంలో కవితాత్మకంగా అక్షర శిల్ప నైపుణ్యంతో వాస్తవ రూప వైవిధ్యం చూపించాలని సూచించారు. అప్పుడే కవికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ఆ దిశగా కవిత్వం రాయాలని కవులను కోరారు. మే 10, 11 తేదీల్లో ఏలూరులో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ప్రతాప్ చెప్పారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన కల్వకొలను తాతాజీ మాట్లాడుతూ శ్రీశ్రీ కళా వేదిక జాతీయ స్థాయిలో 147కవి సమ్మేళనం నిర్వహించి తెలుగు సాహిత్య చరిత్రలో కొత్త చైతన్యంతో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలుగు సాహిత్యానికి వెలుగు నింపుతున్నారని అన్నారు. శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి మాట్లాడుతూ కవిత్వం అంటే అక్షర తాండవం కవిత్వంలో చెప్పేది బలంగా చెప్పాలని అప్పుడే హృదయానికి హత్తుకుంటుందని సామాజిక చైతన్యము రగిలించే కవిత వస్తే నిర్మాణం కవి తన కవితలో సాధన చేయాలని కవిత ధ్వనిపూర్వకంగా ఉండాలన్నారు. జిల్లా శ్రీ శ్రీ కళావేదిక అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి మాట్లాడుతూ కవులు రాసే కవితా వస్తువులో లీనం కావాలని, అప్పుడే భావావేశం అక్షర రూపంలో కెరటంలా దూసుకు వస్తుందన్నారు.






తెలుగు కవిత్వానికి వెలిగి నింపిన మహా కవులు శ్రీ శ్రీ, డాక్టర్ బోయి భీమన్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, టీ. పార్థసారథి, జల్లి సుజాత, కల్వకొలను తాతాజీ, వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి, శ్రీ శ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, జిల్లా కన్వీనర్ బీవీవి సత్యనారాయణ, శ్రీ శ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కళారత్న హంసపురస్కారం అందజేసిన సందర్భంగా జిల్లా కమిటీ ఆయనను ఘనంగా సన్మానించింది. సభకు జిల్లా కన్వీనర్ బి.వి.వి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. గోదావరి పత్రిక సంపాదకుడు బోళ్ల సతీష్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు శ్రీమతి యెందూరి సీతామహాలక్ష్మి, శ్రీమతి పోలిశెట్టి అనంతలక్ష్మి, డాక్టర్ శ్రీపాద రామకృష్ణ, అరిగెల బలరామమూర్తి, కడలి రామకృష్ణారావు, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయ శతాధిక ఉగాది కవి సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒరిస్సా, ఢిల్లీ నుండి 126 మంది కవులు తమ కవితల ద్వారా అక్షర విందును అందించారు. కవులను డాక్టర్ కత్తిమండ, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.పార్థసారధి, కొల్లి రమావతి ఘనంగా సన్మానించారు.



# గోదావరి విలేఖరి ని పరామర్శించిన ప్రభుత్వ విప్ దాట్ల

**కాట్రేనికోన, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కాట్రేనికోన మండల గోదావరి విలేఖరి జగడం శ్రీనివాస్ ను రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) సోమవారం పరామర్శించారు.గత వారం రోజుల క్రితం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శ్రీనివాస్ ను సోమవారం ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వర రావు,మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద,నడింపల్లి సుబ్బరాజు, దాట్ల పవన్,నాయకులు విత్తనాల బుజ్జి ,వాసంశెట్టి రాజేశ్వర రావు ,సత్తాల ప్రసాద్, రేవు రమేష్,మోకా అప్పాజీ, జగడం విజయ్ కుమార్,ఉరంకృష్ణ, సి.హెచ్.సుభాష్ తదితరులున్నారు

# ఎదురులంకలో అంబేద్కర్ జయంతి



**ఐ.పోలవరం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భారత రాజ్యాంగ సృష్టికర్త,అపర మేధావి,డాక్టర్. బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 134వ జయంతి కార్యక్రమం ఎదురులంక, రామాలయం పేటలో ఘనంగా నిర్వహించారు.అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో యూత్ వారు సహాయ సహకారాలతో వృద్ధులకు వితంతువులకు పళ్ళు ,చీరలు గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీ కొత్తపల్లి పీహెచ్సీ అసిస్టెంట్ సర్జన్ గైనకాలజిస్ట్ డాక్టర్ జ్యోతిర్మాయి పాల్గొని మాట్లాడుతూ "కత్తి కన్నా కలం గొప్పది" అన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థిని విద్యార్థులకు చదువుకొని ఉన్నత శిఖరాలను అవరోధించాలని ఆన్నారు .

# అంబేద్కర్ 134వ జయంతి వేడుకల్లో పాల్గొన్న జిల్లా వైసీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి.

### -ఆ మహనీయుని ఆశయ సాధనకై మనం అందరం పనిచేయాలి.





**రావులపాలెం ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అంటరానితనం, వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసి, అస్తిత్వ ఉద్యమాలకు దశ దిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బి.ఆర్. అంబేద్కర్ 134 వ జయంతి సందర్భంగా రావులపాలెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి కొత్తపేట మండలం బండారుపేట గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బండారి పేట గ్రామంలో చదువు కుంటున్న విద్యార్థులకు, చిన్నారులకు పుస్తకాలు మరియు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు , కార్యకర్తలు, చిర్ల అభిమానులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే.

**రావులపాలెం ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



డా.బి.ఆర్. అంబేద్కర్ 134 వ జయంతిని పురస్కరించుకుని సోమవారం రావులపాలెంలోని అంబేద్కర్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిలువూరి సతీష్ రాజు, కె.వి.సత్యనారాయణ రెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
ఏప్రిల్ 15,
మంగళవారం 2025



## బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు



భీమవరం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి మందిరంలో జరిగే 14వ వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాల బ్రోచర్ ను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆవిష్కరించారు. 8 రోజులపాటు కళ్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మందిర అధ్యక్షులు కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు శ్రీవారి కళ్యాణ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, కళ్యాణం, రథోత్సవం, వైభవోత్సవం, ఊరేగింపు, ప్రతిరోజూ ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో కుక్కల బాల, జీవిఐటీ అప్పారావు, చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, ముచ్చకర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## సినీ నటుల సందడి

కాకినాడ,ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

:అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమా టీం సోమవారం కాకినాడ తిరుమల థియేటర్ లో సందడి చేశారు. అభిమానులతో కలిపి సినిమా తిలకించారు. బుల్లితెర యాంకర్ ప్రదీప్ మాచిరాజు హీరోగా ,మరో యాంకర్ దీపికా పిల్లి హీరోయిన్ గా నటించిన ఈ చిత్రం ప్రమోషన్ లో భాగంగా వారు కాకినాడ విచ్చేసారు. ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ తో ఘన విజయం సాధించిందని ప్రదీప్ అన్నారు. వినోదాత్మక చిత్రాలు ఎన్ని వచ్చినా ప్రజలు ఆదరిస్తారని ప్రదీప్ ఆనందం వ్యక్తపరచారు. వారితో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీపడ్డారు.



## రాజ్యాంగం రూపంలో.. అంబేద్కర్ మనతోనే ఉన్నారు..





రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజ్యాంగం రూపంలో అంబేద్కర్ మహాశయుడు మనతోనే ఉన్నారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. అంబేద్కర్ 134 వ జయంతి సందర్భంగా తన సొంత నిధులు రూ. 3 లక్షలతో 13వ వార్డు అంబేద్కర్ నగర్, 46 వ డివిజన్ రామదాసు పేటలో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహాలను సోమవారం ఆయన ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ముందుగా కూటమి ప్రభుత్వం అధికారికంగా గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహానీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం బలం నిరూపించుకోవడానికి కాదని అంబేద్కర్ గొప్పదనం గురించి ఈతరం, భవిష్యత్తు తరాలు తెలుసుకునేందుకని పేర్కొన్నారు. ఆయనను ఎందుకు కొలుస్తున్నాము, ఎందుకు జయంతి వర్ధంతి చేస్తున్నాం, ఆయన ప్రాముఖ్యత ఏమిటనేది అందరికీ తెలియాలని ఆయన అన్నారు. ఈరోజు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామన్నా, కులమతరహిత సమాజం కోసం కృషి చేస్తూ ఉన్నామన్నా, ఇన్ని కులాలు సఖ్యతగా జీవిస్తున్నా మన్నా అందుకు రాజ్యాంగం కారణమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. ప్రపంచ మేధావి అంబేద్కర్ ను దైవంగా భావించాలని ఈతరమే కాదు, భవిష్యత్తు తరాలు కూడా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను గుర్తుపెట్టుఉంటాయని ఆయన అన్నారు. ఆయన స్ఫూర్తితో అందరు ముందుగా వెళదామని చెప్పారు. గత ఐదేళ్ళు వైసీపీ పాలనలో దళితులపై దాడులు, శిరోముండనాలు, చంపి డోరు డెలివరీ చేయడం , వేధింపులు చూశామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చెప్పారు. దళితులను ఆర్థికంగా ఆదుకోవడం కాని, ప్రోత్సాహించడం కాని జరగలేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అంబేద్కర్ జయంతి సందర్భంగా కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సారధ్యంలో దళితులకు రుణాలు ఇస్తున్నారని, ఎస్సీ లోన్లు ప్రారంభించు కుంటున్నామని, దళితులంటే కారు డ్రైవర్లు కాదు, ఓనర్లనే ఆలోచనతో ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటున్నామని, ముందుగా అసమానతలు తొలగాలని, దళితులు ధైర్యంగా ముందుకు వెళ్ళాలని, తాము కూడా డబ్బు సంపాదించుకోగలమనేభావన వారిలో రావాలని కూటమి ప్రభుత్వం ఎస్సీ లోన్లు ఇస్తోందని ఆయన చెప్పారు. గత ఐదేళ్ళు జగన్ పాలనలో ఒక్క లోను అయినా ఇచ్చారా, దళిత డ్రైవరును చంపి డోరు డెలివరీ చేసిన ఎమ్మెల్సీ వ్యక్తి పదవిని రద్దు చేయగలిగారా లేదే అని విమర్శించారు. కాని తమ కూటమి ప్రభుత్వంలో కావలి గ్రీష్మ కు ఎమ్మెల్సీ ఇచ్చామని ధైర్యంగాచెప్పగలుగుతున్నామని ఆయన అన్నారు. గత ఐదేళ్ళు వైసీపీ వారు అంబేద్కర్ జయంతి అంటే తూతూ మంత్రంగా, నామమాత్రంగా చేసి వెళ్ళి పోయేవారని,ఈ ఏడాది కూటమి ప్రభుత్వం గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద అధికారికంగా, అంగరంగ వైభవంగా అంబేద్కర్ జయంతిని చేస్తోందని, గౌరవిస్తోందని, ఇందుకు కారకులైన అధికారులందరని అభినందిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. కాగా గోకవరం బస్టాండ్ నుంచి భారీ కారు ర్యాలీగా అంబేద్కర్ నగర్, రామదాసు పేట చేరుకుని ఆయా ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలు ఆవిష్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ పర్యవేక్షణలో నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు చాపల చిన్న రాజు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ శెట్టిబలిజ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధా, కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, రుంకాని విజయ్, మరుకుర్తి రవి యాదవ్, అగురు ధన్ రాజ్, దుత్తరపు గంగాధర్, కప్పల వెలుగు కుమారి, బొర్రా చిన్ని, ద్వారా పార్వతి సుందరి, కోసూరి చండిప్రియ, కేబుల్ మురళి, బంగారు నాగేశ్వరరావు, దాస్యం ప్రసాద్, చెల్లుబోయిన సూర్య నారాయణ మూర్తి, చింతపల్లి నాని, బోను ఈశ్వరి, గొర్రెల రమణి, ఈతలపాటి రవి, బేసరి చిన్ని, కవులూరి వెంకట రావు, సలాది ఆనంద్, నగరబోయిన రామకృష్ణ, రాయి అప్పన్న బాబు, కర్ణం లక్ష్మీ నాయుడు, మోతా నాగలక్ష్మి, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జీవితం.. అందరికీ మార్గదర్శకం

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ కలెక్టరేట్ లో ఘనంగా 134వ జయంతి వేడుకలు



భీమవరం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక వ్యక్తి మాత్రమే కాదని ఆయన ఒక భావజాలమని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్ నందు గోదావరి భవన్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలో ఇతర అధికారులతో కలిసి అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోదావరి భవన్ లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల సభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారన్నారు. అంబేద్కర్ శక్తివంతులకు వ్యతిరేకంగా ధైర్యంగా స్వరం వినిపించిన సంఘసంస్కర్త అన్నారు. ప్రజలు, ముఖ్యంగా యువత, ఆలోచన లేకుండా ఎవరిని అనుసరించకుండా ఆలోచించి పరిశీలించి సత్యాన్ని తెలుసుకుని నిర్ణయం తీసుకోవడం అంబేద్కర్ జీవితం నుంచి నేర్చుకోవాలన్నారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా ఆయన జీవితాన్ని అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. అంబేద్కర్ పాశ్చాత్య దేశాల రాజ్యాంగాలను సవివరంగా అధ్యయనం చేసి భారతదేశ ప్రత్యేకతలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసి మన దేశం లోని సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అణువుగా రూపొందించారని కలెక్టర్ గుర్తు చేశారు. దేశంలో ఎన్నికల నిర్వహణ, న్యాయవ్యవస్థ, శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు దేశానికి ఎలా మేలు చేయగలవనే అంశాలలో విస్తృతంగా పరిశోధనలు చేసి రాజ్యాంగంలో రూపొందించడానికి మార్గదర్శకత్వం వహించారన్నారు. అంబేద్కర్ ఒక వ్యక్తి మాత్రమే కాదని ఆయన ఒక భావజాలం అని కలెక్టర్ తెలిపారు. ఆయన చూపిన సమానత్వం, విద్య, స్వీయ గౌరవ మార్గం ఈరోజు ప్రతి భారతీయుడు జీవితంలో మార్గదర్శకంగా నిలుస్తోందని కలెక్టర్ అన్నారు. అంబేద్కర్ ముందు చూపుతో రాజ్యాంగంలో పొందుపరచిన రిజర్వేషన్ల మూలంగా సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు లభించి కోట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని చెప్పారు. అంబేద్కర్ ఒక జాతికి మాత్రమే నాయకుడు కాదని జాతీయ నాయకుడని కలెక్టర్ పునరుద్ఘాటించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ఒక వ్యక్తిగత గాధ మాత్రమే కాదని కోట్లాదిమందికి ఆశ, నమ్మకం, మార్గదర్శకం అని స్పష్టం చేసారు. అణగారిన వర్గాల పక్షాన నిలబడిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. అంబేద్కర్ సేవలు కేవలం రాజ్యాంగ రూపకల్పన వరకే పరిమితం అవ్వలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటులో, 1934 లో హిల్టన్ యంగ్ కమిషన్లో ఆర్థిక సిఫార్సులలో కీలక పాత్ర వహించారన్నారు. ప్లానింగ్ కమిషన్ ఏర్పాటుకు ముందు నుంచే ఆర్థిక ప్రణాళికలపై తన సుదీర్ఘ దృష్టితో దేశానికి దిక్సూచిగా నిలిచారన్నారు. దేశ పార్లమెంటులో మహిళల హక్కుల కోసం హిందూ కోడ్ బిల్ ను ప్రవేశపెట్టారన్నారు. హిందూ కోడ్ బిల్ ద్వారా వివాహ, వారసత్వం, స్వతంత్ర జీవన హక్కుల్లో సమానత్వాన్ని చట్టబద్ధం చేయడంలో ఆయన చూపిన మార్గం ఈనాటికి ప్రాధాన్యత కోల్పోలేదన్నారు. అంబేద్కర్ ప్రపంచంలోనే అత్యధికంగా చదువుకున్న భారతీయుల్లో ఒకరని కొలంబియా యూనివర్సిటీ లో పీహెచ్డీ చేసారని గుర్తు చేశారు. విద్యే శక్తి, విద్యే విముక్తి అనే ఆయన చెప్పిన మాటలు యువతకు మార్గదర్శకం కావాలని జాయింట్ కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.వి.ఎన్.ఎల్ రాజకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జ్యోతిలక్ష్మి దేవి, జంగా బాబురావు, భీమ్ రావు, రవిబాబు, దళిత సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాక్టరీలో ఆహార కల్తీ

### 30 మందికి అస్వస్థత

### నాలుగు రోజులుగా దాచిపెట్టిన యాజమాన్యం

### సోమవారం వెలుగులోకి వచ్చిన సంఘటన

కాకినాడ, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం లోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో 30 మందికి ఫుడ్ పాయిజన్ అయ్యింది. పరిశ్రమ క్యాంటీన్ లో వండిన కలుషిత ఆహారం తిని అనారోగ్యం పాలయ్యారు. వారంతా జగ్గంపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.గత శుక్రవారం పరిశ్రమలోని క్యాంటీన్ లో వండిన ఆహారాన్ని తిన్న కార్మికులకు విరోచనాలు మొదలయ్యాయి. ఒక్కొక్కరుగా అనారోగ్యం భారిన పడటంతో ఆ కంపెనీ బస్సులో జగ్గంపేట ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆ ఆసుపత్రిలో వారికి పరీక్షలు చేసి ఆహారం కలుషితం అయినట్లు నిర్ధారించారు. ఆహారం వండేవారు శుభ్రత పాటించక వారు వండిన ఆహారం కలుషితం అయినట్లు ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు నిర్ధారించి ఆ ఆహారం తిన్న వారందరికీ పరీక్షలు చేయించాలని సూచించారు. గత మూడు రోజులుగా ఆసుపత్రిలో పరీక్షలు జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న డి ఎం అండ్ హెచ్ ఓ జె. నరసింహ నాయక్ , అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి.శ్రీనివాస్ బృందం ప్రైవేట్ ఆసుపత్రిలోని రోగులను పరీక్షించారు. రోగులతో మాట్లాడి ఎప్పుడు ఏ ఆహారం తీసుకున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయక్ మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు ఆసుపత్రి రోగులను పరిశీలించామన్నారు. 30 మంది వరకు అనారోగ్యం బారిన పడ్డారన్నారు. అందరూ బాగానే ఉన్నారన్నారు. ఇప్పటికే కొంతమందిని డిశ్చార్జి చేయడం జరిగిందన్నారు. ఇది ఎలా జరిగింది అనేది పరిశీలిస్తామన్నారు. పరిశ్రమను పరిశీలించి ఎవరైనా భాధ్యతారాహిత్యం గా వ్యవహించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉదయం ఇడ్లీ, మధ్యాహ్నం వంకాయ కూర, రాత్రి బిర్యానీ తిన్నారని, కేవలం రాత్రి తిన్న వారికే కాక ఉదయం ఇడ్లీతిన్న వారికి కూడా ఫుడ్ పాయిజన్ జరిగినట్లు తేలింది అన్నారు. వారి వెంట వైద్యులు ప్రభాకర్, విల్సన్, రవి కుమార్, హెల్త్ అసిస్టెంట్, పాల్గొన్నారు.







## జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలు...



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

:భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి అందరికీ అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు,భారత రాజ్యాంగ రూపశిల్పి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరుగని కృషిచేసిన సమ సమాజ స్థాపకుడు, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని ఆ మహనీయుని ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ లు ఎస్పి ఎం.బీ.ఎన్ మురళీకృష్ణ, ఏ.వి సుబ్బరాజు గారు, అడిషనల్ ఎస్పీ( క్రైమ్స్) శ్రీ ఎల్. అర్జున్, ఎల్. చెంచి రెడ్డ, డి.ఎస్.పి. లు బి. రామకృష్ణ రవికుమార్, ఇన్స్పెక్టర్ లు ఏ. శ్రీనివాసరావు, పవన్ కుమార్ రెడ్డి, ఆర్ ఐ లు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు ఆర్. రఘురాం , ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు

ఏలూరు, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరుగు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి సి.హెచ్. రత్నబాబు తెలిపారు. సోమవారం ఏలూరు అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమంలో స్మారక దినం సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించి, అగ్నిమాపక నిరోధక చర్యలపై ముద్రించిన కరపత్రాలు , వాల్ పోస్టర్లు ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఏలూరు కేంద్ర అగ్నిమాపక అధికారి వి.రామకృష్ణ , ఏలూరు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అగ్నిమాపక కేంద్రంలో ప్రదర్శించిన స్టాల్స్ ను సందర్శించి వాటి యొక్క ఉపయోగాలను వివరించారు.

# రాజ్యాంగాన్ని రచించిన మహనీయులు అంబేద్కర్

**అంబేద్కర్ కు నివాళులర్పించిన కేంద్ర మంత్రి వర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామ, కలెక్టర్ నాగరాణి, జిల్లా ఎస్పీ అస్మి, ఎమ్మెల్యే అంజిబాబు**



భీమవరం, ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



వివక్షకు తావు లేకుండా ప్రతీ భారతీయుడికి సముచిత హక్కులు కల్పించేలా రాజ్యాంగాన్ని రచించిన మహనీయులు డా బాబాసాహెబ్ అంబేద్కర్ అని పలువురు వక్తలు అన్నారు. డా బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా సోమవారం భీమవరం అంబేద్కర్ సెంటర్ లో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ నాయిం అస్మి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. వారు మాట్లాడుతూ భారతదేశ చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడిన పేరు డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్, కేవలం ఒక న్యాయవాదిగానో, రాజ్యాంగ నిర్మాతగానో మాత్రమే కాకుండా ఒక గొప్ప సంఘ సంస్కర్తగా అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా ఆయన నిలిచిపోయారన్నారు. ఆయన జీవితం ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిచ్చే ఒక అద్భుత గాథ అని, సామాజిక పోరాటం – అణగారిన వర్గాల ఆశాకిరణం బిఆర్ అంబేద్కర్ అని అన్నారు. అంబేద్కర్ ఆశయాలు, ఆదర్శాలు నేటికి కూడా ఎంతో ఆచరణీయమని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంఘం ప్రెసిడెంట్ కాటం స్టాన్లీ రాజు, సెక్రటరీ డా ఎన్ విజయ్ కుమార్, ట్రెజరర్ డా ఎంఎన్ వి ప్రసాద్, డెవలప్ మెంట్ కమిటీ చైర్మెన్ డా ఆడమిల్లి వీరయ్య, హానరబుల్ ఛైర్మెన్ యేలేటి న్యూటన్, కోళ్ల నాగేశ్వరరావు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

# చెట్లను మొక్కలుగా మారుస్తున్న కడియం నర్సరీ రైతులు

**సృష్టికి ప్రతి సృష్టి - ప్రకృతిలో ఇదో వింత**

**ఇక కనుమరుగు కావు దశాబ్దాల నాటి చెట్లు**

కడియం,ఏప్రిల్ 14 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మొక్కలను చెట్లు గా మార్చడం సృష్టి ధర్మం.ఈ ప్రకృతి ఉన్నప్పటి నుండి కొనసాగుతున్న విధానం. కాని ప్రపంచ ఖ్యాతి గడించిన తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీ రైతులు చెట్లను మొక్కలుగా మారుస్తున్నారు. సృష్టికి ప్రతి సృష్టి సృష్టిస్తున్నారు. ఇది ఏదో కాకతాయంగా ఒకటి రెండు సందర్భాల్లో జరిగినవి కావు. ఇప్పుడు నర్సరీ రైతులంతా ఇదే చేస్తున్నారు.ఇదంతా ఎలా సాధ్యమవుతుంది అనే ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుందాం...

**ప్రకృతి సృష్టి కి ప్రతి సృష్టి**

కాలానుగుణంగా మనుషులు చేసే ఎన్నో పనులను అందుబాటులోకి వచ్చిన యాంత్రీకరణ చేసిస్తుంది. ఇలాంటి సమయంలో మొక్కను నాటి నీరు పోసి అవి పెరిగి పెద్దయ్యాక మన పిల్లలు వాటి అందాలు లేదా ఆక్సిజన్ సౌకర్యాలు పొందడం కాదు.నేరుగా చెట్లు నాటి అక్కడికక్కడ అద్భుతాలు సృష్టించడం కోరుకుంటున్నారు. ఉదాహరణకు ఒక గార్డెన్ పెంచాలంటే ఎన్నో సంవత్సరాలు పట్టేది. కానీ ఇప్పుడు నేల చూపించి కావలసిన చెట్లు వివరాలు తెలిపితే చాలు. వారం తిరగకుండా మీరు ఊహించిన ప్రకృతి అందాలు అక్కడ ప్రత్యక్షమవుతాయి. ఇప్పుడు కడియం నర్సరీ రైతులు అదే చేస్తున్నారు. చాలామంది రైతులు చైనా, థాయిలాండ్,స్పైన్ తదితర దేశాల నుంచి పెద్దపెద్ద చెట్లను లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసి ప్రత్యేక కంటైనర్ ద్వారా ఓడలలో ఇక్కడ తీసుకొచ్చి విక్రయాలు చేపడుతున్న సంగతి తెలిసిందే.

**పురాతన చెట్లు ఇక మాయం కావు**

అయితే ఇప్పుడు అటువంటి పురాతనమైన చెట్లను మొక్కలుగా మార్చి నర్సరీ లలో అమ్మకాలకు ఉంచుతున్నారు. ఇది ఎలా సాధ్యమవుతుందో తెలుసుకుందాం.. పట్టణాలకు దీటుగా పల్లెలు కూడా కాంక్రీటు జంగిల్ గా మారుతున్నాయి.అలాగే రోడ్లు కూడా విస్తరించబడుతున్నాయి. ఇందులో భాగంగా అడ్డుగా ఉన్న దశాబ్దాలు నాటి మర్రి,రావి వంటి చెట్లను తొలగిస్తున్నారు. అలా తొలగించడానికి వేల రూపాయలు ఖర్చు అవుతుంది కూడా. ఎందుకంటే అవి వంట చెరుకుగా కూడా పనిచేయవు. అలాంటి 50 నుంచి వంద సంవత్సరాల వయసు కలిగిన చెట్లకు పునర్జన్మ ఇవ్వడం అంటే మామూలు విషయం కాదు. ఎవరు చెట్లు తొలగించాలనుకుంటున్నా వెంటనే ఈ నర్సరీ రైతులు వెళ్ళి అధునాతన హైడ్రాలిక్ యంత్ర పరికరాలతో ఆ చెట్లను అక్కడి నుంచి తొలగించి మళ్లీ మొక్కకు ఏవిదంగా అంటు కట్టి

పెంచుతారో అదే విధంగా ప్రత్యేకమైన కుండీలు ఏర్పాటు చేసి వాటిని పెంచి పోషిస్తున్నారు. ఎన్నో కిలోమీటర్ల దూరం విస్తరించి ఉండే ఆ చెట్ల వేర్లను తొలగించి చిన్న చిన్న మొక్కలుగా మాదిరిగా వాటిని తిరిగి జీవం పోయడం ఒక అద్భుతమనే చెప్పాలి.

**వీటి ధర లక్షలాది రూపాయలు**

అడ్డొచ్చిన చెట్లను తొలగించినవే కదా అని ఇవి డెడ్ చీపుగా దొరుకుతాయి అనుకుంటే భ్రమ అవుతుంది.ఎందుకంటే వీటి ధర కూడా లక్షల రూపాయలు పలుకుతాయి.ఇదేం దారుణం అనుకుంటున్నారా...అవును మరి ఇదంతా కాలం కలిసి వచ్చి చేసిన ప్రయోగం ఫలిస్తేనే ఈ చెట్టుకు విలువ వస్తుంది. లేదంటే వీరు పడ్డ శ్రమ,పెట్టిన పెట్టుబడి వృదా అవుతుంది. అంతా పురాతనమైన చెట్లను తొలగించి మళ్లీ బతికించడం అంటే ఎంత కష్టమో వేరే చెప్పనవసరం లేదు.చెట్లును యంత్రాలతో తొలగించి వాటిన ప్రత్యేక వాహనంపై నర్సరీకి తరలించడం చాలా ఖర్చుతో కూడుకున్నది. ఈ చెట్లు తిరిగి వేరుపట్టి చిగిరించాలంటే చాలా సమయం పడుతుంది. ఆ సమయం వరకు పోషిస్తూ వేచి చూడాల్సిందే. కొన్ని సందర్భాల్లో ఇవి చిగురించవు. తెచ్చిన చెట్టు చెట్టుగానే ఉండి ఎండిపోతుంది. అలాంటప్పుడు రైతులకు తీవ్ర నష్టం వస్తుంది.

**తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో దేవాలయాలకు డిమాండ్**

రావి,మర్రి వంటి చెట్లు ఎవరికి అవసరం ఉంటాయనే అనుమానం కూడా కలగక మానదు. లక్షల రూపాయలు ఖర్చుపెట్టి ఈ చెట్లను ఇంటి పెరట్లోనా పొలం గట్ల వద్దనో వేసుకోవడానికి కాదు. అధునాతనమైన కార్పొరేట్ కంపెనీలు, కొత్తగా ఏర్పాటు చేసే ఖరీదైన లేఅవుట్‌లు, ధనవంతుల భవంతుల గార్డెన్స్ లోను,ఖరీదైన పార్కుల లోను అప్పటికప్పుడు ప్రత్యక్షం కావాలనుకుంటే వీటిని కొనుగోలు చేయాలి. అన్నిటికంటే ముఖ్యంగా వీటి డిమాండ్ ఎక్కడ ఉంటుందంటే కర్ణాటక,తమిళనాడు రాష్ట్రాల్లో కొత్తగా నిర్మించిన దేవాలయాలకు.ఆయా రాష్ట్రాల భక్తులు ఆలయం ఎంత గొప్పదో ఆలయంలో ఉండే చెట్టును బట్టే గుర్తిస్తారంట. అందువల్ల ఎంతో ఖర్చు పెట్టి ఆలయం నిర్మించిన ఆలయం ముందు ఇటువంటి పురాతన చెట్లు పాతాల్సిందే. అందుకునే వీటికి అక్కడ ఎక్కువ డిమాండ్ ఉందనే వాదన వినిపిస్తుంది.మర్రి,రావి చెట్లు కలిపి ఉంటే ఆ చెట్టుకు మరింత డిమాండ్ ఉంటుంది. ఇక మర్రి,రావి,జువ్వి చెట్లు కలసి ఒకే చెట్టుగా ఉంటే ఇక ఆ చెట్టు ధర ఎంత పలుకుతుందో వెలకట్టలేము.

**మర్రి,రావి వంటి చెట్లునే కాదు**

బాదం,ఉసిరి,గానుగ,వేప,కదంబ,సీమచింత,తుమ్మ,కొబ్బరి చివరకి



తాడి చెట్లును కూడా మొక్కలగా మార్చి అమ్మకానికి పెడుతున్నట్లు ఉమా భారతి నర్సరీ రైతు కొత్తపల్లి మూర్రి తెలిపారు.







# విశాఖ ఉక్కుకు ప్యాకేజీతో ఊపిరి

**98% సామర్థ్యంతో పనిచేస్తున్న రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు**

**రోజుకు సగటున 13,485 టన్నుల ఉత్పత్తి**

**2024-25 ఉక్కు శాఖ వార్షిక నివేదిక వెల్లడి**



దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన తర్వాత వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిస్థితి కాస్త మెరుగుపడినట్లు ఉక్కు శాఖ తాజాగా విడుదల చేసిన 2024-25 వార్షిక నివేదిక వెల్లడించింది.

గత అక్టోబరు నుంచి రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ ప్రారంభించిన అనంతరం సంస్థ ఉత్పత్తి సామర్థ్యం సగటున రోజుకు 13,485కి పెరిగింది. ప్రస్తుతం రెండు ఫర్నేస్‌లు 98% ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. హై ఎండ్ విలువ గల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని, దానికి సంబంధించి దేశీయ మార్కెట్‌లో తన వాటాను పెంచుకుంది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించకముందు చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం కారణంగా పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయలేదు. దీంతో సంస్థ అమ్మకాల టర్నోవర్ 2024-25 డిసెంబరు నాటికి రూ.12 వేల కోట్లకే పరిమితమైంది. ఫలితంగా నష్టాలు రూ.3,943 కోట్లకు చేరాయి. ఈ ఏడాదిలో సంస్థలోని ఉద్యోగుల సంఖ్య 1,198 మేర తగ్గింది. రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌ను పునఃప్రారంభించి.. కంపెనీ అధీకృత వాటాలు 2024 మార్చి 31 నాటికి రూ.8 వేల కోట్ల మేర ఉండగా, 2024 డిసెంబరు 31 నాటికి అది రూ.15 వేల కోట్లకు పెరిగింది. నిధుల కొరత, ఆర్థిక సంక్షోభం కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్లాంట్ పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేయలేదు. దీంతో అమ్మకాలు 2024 డిసెంబరు 31 నాటికి రూ.12,429 కోట్లకు పడిపోయాయి. రూ.3,943.43 కోట్ల మేర నికరనష్టం వాటిల్లింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీతో సంస్థ 2024 అక్టోబరు 28 నుంచి రెండో బ్లాస్ట్‌ఫర్నేస్‌ను పునఃప్రారంభించి రోజుకు సగటున 13,485 టన్నుల ఉత్పత్తి సాధించింది. రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు 98% ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకున్నాయి. అనుకున్న సమయానికి ముందే 2వ బ్లాస్ట్‌ఫర్నేస్‌ను ప్రారంభించడంతోపాటు డిసెంబరులో ఇదివరకున్న ఉత్పత్తి సామర్థ్యాన్ని మించింది. రెండు ఫర్నేస్‌ల ద్వారా రోజుకు 13 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం సాధించాలన్నది లక్ష్యంకాగా దానికంటే 3.7% అదనంగా సాధించింది. బొగ్గులో హార్డ్ కోకింగ్ కోల్‌ను కలపడాన్ని 57.5% నుంచి 53.4%కి తగ్గించుకుంది. మార్కెట్‌ను విస్తృతం చేసుకోవడానికి.. మార్కెట్‌ను విస్తృతం చేసుకోవడానికి డిస్ట్రిబ్యూషన్ విధానాన్ని పునర్వ్యవస్థీకరించింది. ఇతర ఉత్పత్తి సంస్థల మాదిరిగానే టీఎంటీ, స్ట్రక్చరల్ ఉత్పత్తుల విక్రయాల కోసం డిస్ట్రిబ్యూటర్/డీలర్ విధానాన్ని తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఏ మారుమూల ప్రాంతాలకైనా తన ఉత్పత్తులను పంపేందుకు వీలుగా ఈ-సువిధ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారుల ఇంటి వద్దకే తన సేవలు అందించేందుకు సిద్ధమైంది. సంస్థలో ఉద్యోగుల సంఖ్య 2024 మార్చి 31 నాటికి 13,536 ఉండగా, డిసెంబరు 31నాటికి 12,338కి తగ్గింది. 2023-24లో సంస్థకు రూ.5,218.46 కోట్ల నష్టం వాటిల్లింది. గత నాలుగేళ్లలో ఇదే అత్యధికం. అధిక ఉత్పత్తి అదనపు రాబడి 2024 డిసెంబరు నాటికి.. విశాఖ స్టీల్ ప్లాంట్ హై ఎండ్ విలువ ఉన్న ఉక్కు ఉత్పత్తిని 12.96 లక్షల టన్నుల నుంచి 13.28 లక్షల టన్నులకు పెంచింది. విక్రయించడానికి అనువైన 23.73 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి సాధించింది. గోదాముల్లో పడి ఉన్న 30 వేల టన్నుల ఉక్కును విక్రయించింది. దేశీయ ఉక్కు విక్రయాల్లో 2023-24లో ఉన్న 57% వాటాను 63%కి పెంచుకుంది. హై ఎండ్ విలువగల స్టీల్ విక్రయాల్లో తన వాటాను 31% నుంచి 35%కి చేర్చింది. మొత్తం విక్రయాల్లో నేరుగా పంపిణీ చేసే పరిమాణం 2023-24లో 30% ఉండగా, 2024-25 నాటికి అది 42%కి పెరిగింది. 95,200 మెట్రిక్ టన్నుల ఇనుము, ఉక్కు తుక్కు విక్రయం ద్వారా రూ.336 కోట్ల అదనపు రాబడి సాధించింది.

తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
ఏప్రిల్ 15,
మంగళవారం 2025


## చెన్నై ఏడో పోరు..

# ఇకనైనా 'లక్' మారేనా?

**చెన్నై : వరుస విజయాలతో దూకుడు మీదున్న లఖ్‌నవూ తన సొంత మైదానంలో చెన్నైతో తలపడనుంది. ఇప్పుడీ మ్యాచ్‌లో ఎల్‌ఎస్‌జీ గెలిస్తే అగ్రస్థానంలోకి దూసుకెళ్తుంది. జట్టులో నాణ్యమైన బ్యాటర్లు.. బౌలర్లు.. అందరికీ తోడుగా 'కెప్టెన్' కూల్. కానీ, ఎప్పుడో టోర్నీ ఆరంభంలో ఓ విజయం. అప్పటినుంచి అన్నీ పరాభవాలే. ఒక్కసారి 'గెలుపు' బాట పడితే ఆపడం ఎవరితరమూ కాదని వారికీ తెలుసు. అయితే, పుష్‌అప్ ఎప్పుడనేదే ప్రశ్న. మరి 'లక్'నవూతోనైనా సీఎస్కేకు కలిసొచ్చేనా?**



### ఏ మంత్రం పనిచేసేను?

టోర్నీ ఆరంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. సమతూకమైన పేస్, స్పిన్‌తో బలంగా కనిపించింది. ఇక బ్యాటింగ్‌లోనూ డేంజరస్ ఆటగాళ్లున్నారు. తీరా, మైదానంలోకి దిగాక అంతా తేలిపోవడం మేనేజ్‌మెంట్‌తోపాటు అభిమానులను షాక్‌కు గురిచేసే అంశం. డేవన్ కాన్వే దూకుడు ముందు ఏ బౌలరూ నిలిచేవాడు కాదు. కానీ, ఈసారి అతడి వేగం ఏమైందో తెలియడం లేదు. ఇక రచిన్ నుంచీ భారీ ఇన్నింగ్స్‌లు రావడం లేదు. గాయంతో టోర్నీకే రుతురాజ్ దూరం కావడం సీఎస్కేకు పెద్ద దెబ్బే. అతడి స్థానంలో 17 ఏళ్ల ఆయుశ్ మాత్రేను తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. కానీ, అతడు ఇప్పుడీ మ్యాచ్‌లో ఆడడు. ఏప్రిల్ 20న ముంబయితో మ్యాచ్ నాటికి జట్టులో చేరతాడని సమాచారం. దీపక్ హుడా పరిస్థితి ఘోరం. బంతిని హిట్ చేయడమూ గగనమైంది. దీంతో అతడిని పక్కనపెట్టేసి విజయ్ శంకర్‌ను తుది జట్టులోకి తీసుకుంది. విజయ్ నిదానంగా మాత్రమే ఆడే ప్లేయర్. టీ20ల్లో వేగమూ అవసరమే. సమయానికి తగినట్లుగా దూకుడు ప్రదర్శించడం లేదు. ధోనీ ఆఖర్లో వచ్చి భారీషాట్లు కొడుతున్నా అవి విజయానికి సరిపోవడం లేదు. శివమ్ దూబె ఆటతీరును అంచనా వేయడమూ కష్టమే. ఒక్కోసారి బాగా ఆడేస్తాడు. తర్వాత నిరాశపరిచి వెళ్లిపోతాడు. ఇక రవీంద్ర జడేజా, రాహుల్ తివారి గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. మిడిలార్డర్‌లో ఇన్నింగ్స్‌ను నడిపించే బ్యాటరే కనిపించడం లేదు.

### అక్కడంతా హిట్టర్లు..

నికోలస్ పూరన్, ఐడెన్ మార్‌క్రమ్, డేవిడ్ మిల్లర్, రిషభ్ పంత్.. వీరంతా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ భారీ హిట్టర్లు. అసలే తమ సొంత మైదానం. పైగా హ్యాట్రిక్ విజయాలతో జోష్ మీదున్నారు. ఇలాంటి బ్యాటర్లను సీఎస్కే బౌలింగ్ విభాగం కాచుకోగలదా? అనేది అనుమానమే. సీనియర్లు రవీంద్ర జడేజా, అశ్విన్ తేలిపోతూ నిరాశ పరిచారు. చాన్నాళ్ల తర్వాత సొంత జట్టుతో బరిలోకి దిగిన అశ్విన్ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడం లేదు. పవర్‌ప్లేతోపాటు మిగతా ఓవర్లలోనూ భారీగా పరుగులు సమర్పించాడు. వీరితో పోలిస్తే నూర్ అహ్మద్ చాలా బెటర్. సీఎస్కే విజయాలు తక్కువైనా.. పర్పుల్ క్యాప్ హోల్డర్‌గా నూర్ (12 వికెట్లు) ఉన్నాడంటే అతడి ప్రదర్శన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పతిరన పైనే పేస్ భారం నడుస్తోంది. ముకేశ్ చౌధరి, ఓవర్టన్ నుంచి సరైన సహకారం లభించడం లేదు.

### ఇది ఓడితే అంతే..

ప్లేఆఫ్స్ రేసులో చాలా పోటీ నెలకొంది. ఇప్పటికే టాప్-4లో ఉన్న టీమ్‌లు నాలుగేసి విజయాలు సాధించాయి. తొలి స్టేజ్ (ఏడు మ్యాచులు) ముగింపు దశకు చేరుకుంటుంది. ప్రస్తుతం ఒకేఒక్క విజయంతో సీఎస్కే పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. రెండు పాయింట్లతో ఉన్న సీఎస్కే మిగతా అన్ని మ్యాచుల్లోనూ గెలిస్తేనే 'ప్లేఆఫ్స్' రేసులో నిలుస్తుంది. రుతురాజ్ గైర్హాజరీలో మళ్లీ ధోనీ జట్టు పగ్గాలు స్వీకరించాడు. కానీ, తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాభవం ఎదురైంది. ఆ ఓటమి నుంచి జట్టు మానసికంగా బయటకొచ్చి విజయం సాధించాలి. లేకపోతే ఇప్పటికే అతితక్కువగా ఉన్న 'ప్లేఆఫ్స్' అవకాశాలు మరింత సన్నగిల్లే ప్రమాదం లేకపోలేదు.

# ఐసీసీ క్రికెట్ కమిటీ చైర్మన్‌గా మళ్లీ


**దుబాయ్: ఐసీసీ పురుషుల క్రికెట్ కమిటీ చైర్మన్‌గా మరోసారి భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ నియమితుడయ్యాడు. దుబాయ్‌లో వార్షిక సర్వసభ్య సమావేశం సందర్భంగా గంగూలీని మరోసారి కమిటీ చైర్మన్‌గా ఎనుకున్నారు. మరో భారత మాజీ ఆటగాడు వీవీఎస్ లక్ష్మణ్ సైతం కమిటీలో సభ్యుడిగా కొనసాగనున్నాడు.**



డెస్మండ్ హేన్స్ (వెస్టిండీస్), హమిద్ హసన్ (అఫ్గానిస్థాన్), బవుమా (దక్షిణాఫ్రికా), జొనాథన్ ట్రాట్ (ఇంగ్లాండ్) కమిటీలో ఇతర సభ్యులు. అనిల్ కుంబ్లే స్థానంలో 2021లో గంగూలీ బాధ్యతలు అందుకున్నాడు. కేథరిన్ క్యాంప్‌బెల్ (న్యూజిలాండ్) నేతృత్వంలోని మహిళల కమిటీలో అవ్రిల్ ఫహే (ఆస్ట్రేలియా), మొసెకి (దక్షిణాఫ్రికా) సభ్యులుగా ఉన్నారు. అఫ్గాన్ మహిళా క్రికెటర్ల కోసం టాస్క్‌ఫోర్స్: అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ల పాలన మొదలైనప్పటి నుంచి చెల్లాచెదురైపోయిన ఆ దేశ మహిళా క్రికెటర్ల కోసం ఐసీసీ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. మహిళలు ఆటలు ఆడడానికి తాలిబన్లు వ్యతిరేకం కావడంతో అఫ్గాన్ అమ్మాయిల క్రికెట్ జట్టు ఉనికే లేకుండా పోయింది. కొందరు అఫ్గాన్ మహిళా క్రికెటర్లు ఆస్ట్రేలియా లాంటి దేశాలకు శరణార్థులుగా వెళ్లి మ్యాచ్‌లు ఆడుకుంటున్నారు. వీరితో పాటు క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే అఫ్గాన్ మహిళల కోసం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఐసీసీ వార్షిక సమావేశాల్లో నిర్ణయించారు. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ బోర్డుల సహకారంతో ఈ టాస్క్‌ఫోర్స్ పని చేస్తుంది.

# నా ఇన్నింగ్స్‌కు విలువే లేదు: కరుణ్ నాయర్

**దిల్లీ : కరుణ్ నాయర్ ఐపీఎల్ పునరాగమనం ఘనంగా జరిగింది. బ్యాటింగ్‌పరంగా అద్భుతంగా ఆడాడు. అయితే, తాను ప్రాతినిధ్యం వహించిన దిల్లీ క్యాపిటల్స్‌కు ఓటమి ఎదురుకావడం నిరాశపరిచిందని కరుణ్ వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబయితో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ 12 పరుగుల తేడాతో ఓడిపోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన కరుణ్ నాయర్ 40 బంతుల్లో 89 పరుగులు చేశాడు. అయితే, ఆఖర్లో వరుసగా మూడు రనౌట్లు కావడంతో దిల్లీ పరాజయం చవిచూసింది. తన ప్రదర్శనపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు కరుణ్ నాయర్ సూపర్ సమాధానం ఇచ్చాడు.**




"నా ఇన్నింగ్స్‌పై మాట్లాడటానికి ఏమీ లేదు. ఇప్పుడు పెద్ద ప్రయోజనమూ లేదు. మంచి ఆటతీరే ప్రదర్శించా. కానీ, నా టీమ్ ఓడిపోయింది. కాబట్టి, ఆ ఇన్నింగ్స్‌కు విలువే లేదు. విజయం సాధించనప్పుడు ఎంత గొప్ప ఇన్నింగ్స్ అయినా వాల్యూ ఉండదు. ఈ సీజన్‌కు ముందు నేను ఐపీఎల్‌లో ఆడతాననే నమ్మకంతోనే ఉన్నా. ఎప్పుడు అవకాశం వచ్చినా నిరూపించుకొనేందుకు సిద్ధంగానే ఉన్నా. మనసులో మాత్రం క్రీజ్‌లోకి వెళ్లాక అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించాలని భావించా. ఇన్నింగ్స్‌ను వేగవంతం చేయడానికి కొన్ని బంతులు తీసుకున్నా. పవర్ ప్లేలో దూకుడుగా ఆడాల్సి ఉంటుంది. నేను మామూలుగా ఆడే షాట్లనే కొట్టా. నాకు అన్నీ కలిసొచ్చాయి. నా బ్యాటింగ్ పరంగా సంతోషంగానే ఉన్నా. మా జట్టు విజయం సాధించి ఉంటే ఇంకా బాగుండేది" అని కరుణ్ వెల్లడించాడు.

### ఫాఫ్ లేని లోటు..

"పవర్ ప్లేలో ఫాఫ్ డుప్లెసిస్ డేంజరస్ బ్యాటర్. అతడు లేని లోటును పూరించాల్సిన బాధ్యత నాది. బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లంతా తమ అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్నారని తెలుసు. అందుకే మెంటల్లీ నేను కూడా నా ఛాన్స్ కోసం సిద్ధంగానే ఉన్నా. తుది జట్టు ఎంపిక ఎప్పుడూ కఠినమే. ఆ విషయంలో మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తా. నా సన్నద్ధతను ఎప్పుడూ కొనసాగిస్తూనే ఉంటా. అవకాశం వచ్చినప్పుడు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తా" అని వెల్లడించాడు.

# ఇంగ్లాండ్‌తో టెస్టుల్లో అతడు ఉండాల్సిందే: రాయుడు



**ముంబయి : ఐపీఎల్‌లోకి పునరాగమనం చేసి అద్భుతమైన ఇన్నింగ్స్‌తో కరుణ్ నాయర్ ఆకట్టుకున్నాడు. దిల్లీ తరఫున బరిలోకి దిగిన కరుణ్ ముంబయిపై 40 బంతుల్లోనే 89 పరుగులు చేశాడు. మూడేళ్ల తర్వాత నాయర్ ఐపీఎల్‌లోకి అడుగుపెట్టాడు. 2018 తర్వాత తొలి హాఫ్ సెంచరీ కావడం గమనార్హం. గతేడాది దేశవాళీ సీజన్‌లో కరుణ్ నాయర్ భారీగా పరుగులు రాబట్టాడు. దీంతో అతడిని మళ్లీ జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లూ పెరిగాయి. ఇప్పుడీ ఇన్నింగ్స్‌తో కరుణ్‌ను ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక చేయాలని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు వ్యాఖ్యానించాడు.**

"కరుణ్ నాయర్ పట్టుదల అద్భుతం. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు ఎదుర్కొనేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలి. కెరీర్‌లో ప్రతి క్రికెటర్‌కూ ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది. దానిని తట్టుకోవడం తేలికేం కాదు. చాలా తక్కువమంది మాత్రమే ఇలాంటి వాటి నుంచి బయటపడ్డారు. ఈ జాబితాలో కరుణ్ నాయర్ ఉంటాడు. ఎందుకంటే భారత దేశవాళీ సిస్టమ్ దెబ్బతింటే మాత్రం కరుణ్ నాయర్ వంటి క్రికెటర్లు మళ్లీ పునరాగమనం చేసేందుకు సిద్ధమయ్యేవాళ్లే కాదు. మన చుట్టూ ఎన్నో అంశాలు మానసికంగా ప్రభావం చూపిస్తాయి. క్రికెట్ అనేది చాలా త్వరగా మారిపోయే క్రీడ. ఎన్నో మార్పులు వస్తుంటాయి. కరుణ్ నాయర్ మాత్రం తన ఆశయంలో మార్పు లేదని నిరూపించాడు. ఎప్పుడూ కష్టపడటాన్ని వదల్లేదు. తప్పకుండా జాతీయ జట్టుకు మళ్లీ ఆడతాననే నమ్మకంతో ఉన్నాడు. టెస్టుల్లోకి పునరాగమనం కోసం సిద్ధమయ్యాడు. అందుకే, ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు కరుణ్‌ను ఎంపిక చేయాలి. అతడికి అర్హత ఉందని భావిస్తున్నా" అని రాయుడు వెల్లడించాడు. ఇంగ్లాండ్‌తో జూన్ నుంచి ఐదు టెస్టుల సిరీస్‌ను టీమ్ఇండియా ఆడనుంది.

### కరుణ్ పాత ట్వీట్ వైరల్

మూడేళ్ల కిందట తన అంతర్జాతీయ క్రికెట్ పునరాగమనంపై కరుణ్ చేసిన పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. 'డియర్ క్రికెట్.. నాకు మరొక ఛాన్స్ ఇవ్వు' అని 2022లో పోస్టు పెట్టాడు. తాజాగా ముంబయితో మ్యాచ్ అనంతరం దిల్లీ క్యాపిటల్స్ కూడా ఆ ఇమేజ్‌ను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. దిల్లీ 12 పరుగుల తేడాతో ఓడినప్పటికీ కరుణ్ పోరాటం మాత్రం ఆకట్టుకుంది. సెంచరీకి చేరువగా వచ్చిన తన టీమ్‌ను గెలిపించేందుకు తీవ్రంగానే ప్రయత్నించాడు. 'ఇంపాక్ట్' ప్లేయర్‌గా ఈసారి సీజన్‌లో తొలి మ్యాచ్‌ను ఆడటం గమనార్హం.

# ఆర్చరీ ప్రపంచకప్.. ధీరజ్ బృందానికి రజతం




**అమెరికా : ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీలో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్‌తో కూడిన బృందం రజతం గెలుచుకుంది.**

ఆదివారం పురుషుల రికర్వ్ టీమ్ విభాగం తుదిపోరులో భారత్ (ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్) 1-5తో చైనా చేతిలో ఓడింది. ఫైనల్లో భారత్, చైనా తొలి సెట్‌లో నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. రెండు జట్లు సరిగ్గా 54 పాయింట్లే సాధించడంతో సెట్ టై అయింది. రెండో సెట్‌లో చైనా (లి జాంగ్‌యున్, వాంగ్ యన్, కావో వెన్‌చావో) సత్తా చాటింది. నాలుగు పది పాయింట్లు గెలుచుకుని 58-55తో సెట్‌ను సొంతం చేసుకుంది. స్వర్ణంపై ఆశలు నిలవాలంటే తప్పక గెలవాల్సిన మూడో సెట్లో భారత్ మరోసారి తడబడింది. దీంతో చైనా 55-54తో సెట్‌తో పాటు పసిడిని కైవసం చేసుకుంది. ఈ విభాగంలో కాంస్యం కూడా చైనాకే దక్కింది. ఈ టోర్నీలో భారత్‌కు లభించిన మూడో పతకమిది. ఇంతకుముందు వెన్నం జ్యోతి సురేఖ-రిషబ్ యాదవ్ జోడీ కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్లో పసిడి గెలవగా.. పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత్ కంచు పతకాన్ని ముద్దాడింది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో అభిషేక్‌వర్మ కొద్దిలో పతకాన్ని చేజార్చుకున్నాడు. ఫైనల్లో అతడు 141-145తో చియాలున్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడాడు.

CINIMA NEWS
https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక



## రూపాన్ని బట్టి మనుషుల్ని అంచనా వేయడం సరైంది కాదు : నిత్యామేనన్



శారీరక రూపాన్ని బట్టి మనుషుల్ని అంచనా వేయడమనేది సరియైన ఆలోచన కాదని ప్రముఖ నటి నిత్యామేనన్ పేర్కొన్నది. ప్రస్తుతం ధనుష్ తో ఇడ్లీ కడై అను సినిమాలో షఉటింగ్ ఆమె బిజీగా ఉన్నారు. తన రూపాన్ని మార్చుకోమని ఎంతో మంది విమర్శించారని తెలిపారు. “పాఠశాల, కళాశాల రోజుల నుంచే నా జుట్టుతో ఎప్పుడూ సమస్య ఉండేది. నా మొదటి సినిమా చేస్తున్నప్పుడు కొందరు “ఈ జుట్టు ఏమిటి? ఇది చాలా వింతగా ఉంది” అని అన్నారు. కానీ ఇప్పుడు అందరూ ఈ రింగుల జుట్టునే ఇష్టపడతారు. కానీ ఆ రోజుల్లో ఇది అందరికీ ఓ వింతలా కనిపించింది. మీరు చాలా పొట్టిగా, లావుగా, మీ కనుబొమ్మలు పెద్దవిగా ఉన్నాయి’.. ఇలాంటి మాటలు కూడా నాకు ఎదురయ్యాయి. ఈ మాటలు నన్ను చాలా ప్రభావితం చేస్తుంటాయి. ప్రభావితం చేయాలి కూడా. అప్పుడే మీరు ఆ సవాళ్లను ఎదుర్కొగలరు. కానీ ఎన్ని విమర్శలు ఎదురైనా ఎప్పుడూ నా రూపాన్ని మార్చుకోవడానికి ప్రయత్నించలేదు. నాలాగే ఉండి నేనేంటో నిరూపించుకోవాలనుకున్నానని” పేర్కొన్నారు.



## మాస్ జాతర నుంచి ‘తు మేరా లవర్’ విడుదల

హైదరాబాద్ బ్యూరో : మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం ‘మాస్ జాతర’. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పుడు ఈ చిత్రం నుంచి మొదటి గీతంగా ‘తు మేరా లవర్’ను విడుదల చేశారు. ప్రోమోతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ‘తు మేరా లవర్’ గీతం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా చూశారు. తాజాగా విడుదలైన ఈ పాట, ఒక్కసారి వినగానే శ్రోతలకు అభిమాన గీతం మారిపోతోంది. ధమాకా జోడి రవితేజ-శ్రీలీల అందరి అంచనాలను అందుకునేలా, అద్భుతమైన కెమిస్ట్రీతో మరోసారి మ్యాజిక్ చేశారు. ప్రేక్షకులకు వెండితెరపై పూర్తి స్థాయి ట్రీట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఈ పాటతో చెప్పకనే చెప్పేశారు. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో ‘తు మేరా లవర్’ గీతాన్ని అద్భుతంగా స్వరపరిచారు. భాస్కరభట్ల సాహిత్యం మాస్ మెచ్చేలా ఉంది. రవితేజ బ్లాక్‌బస్టర్ చిత్రం ‘ఇడియట్’లోని ఐకానిక్ చార్ట్‌బస్టర్ ”చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే” పాటకు ట్రిబ్యూట్ గా మలిచిన ‘తు మేరా లవర్’ అభిమానులకు విందు భోజనంలా ఉంది. దీనిని ఒక ప్రత్యేకమైన సంగీత నివాళిగా మార్చడానికి నిర్మాతలు కఅత్రిమ మేధస్సు ని ఉపయోగించి దివంగత సంగీత దర్శకుడు చక్రి స్వరాన్ని తిరిగి సృష్టించారు. రవితేజ శైలి ప్రత్యేక డ్యాన్స్ స్టెప్పులు, శ్రీలీల అద్భుతమైన నఅత్య ప్రదర్శనతో ఈ గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దర్శకుడు భాను బోగవరపు రవితేజ అభిమానులతో పాటు, మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా ‘మాస్ జాతర’ను మలుస్తున్నారు. ప్రముఖ ఛాయగ్రాహకుడు విధు అయ్యన్న తన ప్రభావవంతమైన విజువల్స్ తో పాటకి తగ్గట్టుగా మాస్ వైబ్‌ను అద్భుతంగా చూపించారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విధంగా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గా ‘మాస్ జాతర’ రూపొందుతోంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

## 17న ‘పాడింగ్టన్ ఇన్ పెరూ’ విడుదల

హాలీవుడ్ మూవీ ‘పాడింగ్టన్ ఇన్ పెరూ’ భారతదేశంలో ఈనెల 17న విడుదల కానుంది. వివిధ భాషల్లో ఈ సినిమా తాజా ట్రైలర్ విడుదలై ఆకట్టుకుంటోంది. ఇందులో అందరికీ ఇష్టమైన ఎలుగుబంటి పెరూ అడవుల గుండా తన గొప్ప సాహసయాత్రకు బయలుదేరినట్లు కనిపిస్తుంది. ఈ సిరీస్‌లో ఇది మూడోభాగం. ఇందులో సాహసం, రహస్యాలతో నిండివుంది. ప్రేమగల ఎలుగుబంటి అత్త లూసీ, ఎల్ డొరాడోలను వెతుకుతూ ప్రమాదకరమైన అడవులు, నదులు, పురాతన శిథిలాల గుండా ప్రయాణిస్తుంది. డౌగల్ విల్సన్ దర్శకత్వం వహించారు. సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా ఈ సినిమాను విడుదల చేస్తోంది.



## ‘బాంబు పెట్టి పేల్చేస్తాం’ : సల్మాన్‌కు మళ్లీ బెదిరింపులు

ముంబయి : బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ను చంపేస్తామంటూ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి గత కొంతకాలంగా హెచ్చరికలు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఆయనకు మళ్లీ బెదిరింపులొచ్చాయి. ‘ సల్మాన్ ఇంట్లోకి చొరబడి కాల్పులు జరుపుతాం.. లేదంటే కారులో బాంబు పెట్టి పేల్చేస్తాం ” అంటూ %ఔ% వర్లీ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌కు తాజాగా ఒక వాట్సాప్ సందేశం వచ్చింది. ఈ సమాచారం తెలుసుకున్న ముంబయి పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సందేశాన్ని పంపిన వ్యక్తిని కనిపెట్టే పనిలో ఉన్నారు. ఇటీవల సల్మాన్‌కు బెదిరింపులు ఎక్కువైన నేపథ్యంలో ప్రభుత్వం ఆయనకు వై ప్లస్ సెక్యూరిటీని నియమించింది. ఈ క్రమంలోనే ఆయన భారీ భద్రత నడుమ షఉటింగ్స్, పబ్లిక్ ఈవెంట్స్‌కు హాజరవుతున్నారు. తాజాగా మళ్లీ బెదిరింపు వచ్చింది.




# పేదల పై తన మనసును చాటుకున్న హీరోయిన్ తాప్సీ

## తాప్సీ పన్ను గొప్ప మనసు చాటారు: వేసవి కాలంలో పేదలకు సహాయం

తాప్సీ పన్ను కేవలం ఒక ప్రఖ్యాత నటి మాత్రమే కాకుండా, తన మంచి హృదయంతో ప్రజల మనసులు గెలుచుకున్న వ్యక్తి. ఈ వేసవి కాలంలో, ముంబయి మురికివాడలలోని పేద కుటుంబాలకు సహాయం చేయడానికి ఆమె చేసిన ప్రౌఢ చర్య ఇప్పుడు అందరి ప్రశంసలను అందుకుంటోంది. హేమకుంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె మరియు ఆమె భర్త మథియాస్ బో కలిసి వారం రోజులుగా ఈ సహాయ కార్యక్రమం చేపట్టారు. వేసవి లో ఎండల వేడి ముంచుకొస్తున్నప్పుడు, తాప్సీ పన్ను చేసిన ఈ చొరవ ఎంతో ఆదర్శప్రాయమైనది. ముంబయి వంటి పెద్ద నగరాల్లో, వేసవిలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటుతుంటాయి. ఈ వేడి పేదవాళ్లకు, ముఖ్యంగా మురికివాడ ప్రాంతాలలో నివసించే వారు తీవ్రంగా ఎదుర్కొంటారు. ఇంట్లో సరైన వాతావరణం లేకపోవడంతో వారు ఎండల తాపం నుంచి ఉత్కంఠతో బాధపడతారు. ఈ పరిస్థితులను గమనించి, తాప్సీ పన్ను పేదలకు సహాయం చేయాలని భావించింది.



ఫ్యాన్లు, కూలర్లు, వాటిని సులభంగా అందించగలిగే ఒక చొరవను ఆమె తీసుకుంది. ది ఒక మంచి ఉదాహరణ, సహాయం చేయడం అనేది కేవలం ధనవంతులకు మాత్రమే పరిమితమైన పనిగా ఉండకూడదని. తన పేరు, తన గొప్పతనాన్ని ఉపయోగించి, తాప్సీ పన్ను అనేక మందికి సహాయాన్ని అందించింది. తాప్సీ పన్ను చెప్పినట్లుగా, “మనం ఫ్యాన్ లేదా కూలర్ వంటి ప్రాథమిక సౌకర్యాలను తేలికగా తీసుకుంటాం. కానీ, చాలా మందికి ముఖ్యంగా ఈ భరించలేని వేడిలో ఉన్న వారికి చిన్న గాలి కూడా ఒక వరంలా అనిపిస్తుంది.” ఆమె చెబుతున్న మాటలు వాస్తవంగా మనందరినీ ఆలోచింపజేస్తాయి. తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు, నిరుపేదలతో తమ బాధను పంచుకోవడం, వారిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. తాప్సీ మరియు ఆమె భర్త ఈ సహాయం చేసే దృక్పథం నిజంగా మానవతాపూరితమైనది. నిఖార్సయిన చొరవ కావడమే కాకుండా, ఆమె పేదవారికి ఆశగా నిలిచింది. పేదవారిని ఆదుకోవడం, వారిని గుర్తించడం మానవత్వానికి పెరుగుదల ఇచ్చే మార్గమే. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, నెటిజన్లు తాప్సీ పన్ను చేయూతను ప్రశంసించారు. హేమకుంట్ ఫౌండేషన్ డైరెక్టర్ హర్తీరత్ సింగ్ మాట్లాడుతూ, “ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటినప్పుడు, గాలి లేదా నీడ లేని మురికివాడ ప్రాంతాలలో ఉండటం దాదాపు అసాధ్యం అవుతుంది. ఈ ప్రక్కనే, భవనాలు, ఇళ్లు సన్నగా ఉన్నంత మాత్రాన, వారికీ తేలికగా ఉండే పరిస్థితి లేదు. ఫ్యాన్ లేదా కూలర్ లేకుండా వారు మౌనంగా బాధపడుతున్నారు. ఇదే కారణంగా, ఈ కార్యక్రమం ప్రారంభించడానికి మమ్మల్ని ప్రేరేపించింది.” చాలా మంది నటీమణులు తమ నటనతో ప్రేక్షకులను మెప్పిస్తుంటే, తాప్సీ పన్ను తన మానవతా కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుంటోంది. ఈ చొరవపై నెటిజన్లు అభినందనలతో ప్రశంసలతో ఘనంగా స్పందించారు. ఆహ్లాదకరమైన గాలి, ఉష్ణోగ్రతల నుండి కొంత ఉపశమనం కోసం అందించిన ఈ సహాయం ఎంతో ప్రేరణనిచ్చింది.



## ఓటీటీకి వచ్చేసిన ‘యమకాతగి’

తమిళ చిత్రసీమలో ఓ కొత్త తరహా థ్రిల్లర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ‘యమకాతగి’ అనే ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ వేదిక ‘ఆహా తమిళ్’ లో స్ట్రీమింగ్ అవుతోంది. సూపర్ నేచురల్ థ్రిల్లర్ జోనర్లో వచ్చిన ఈ సినిమా, మార్చి 7న థియేటర్లలో విడుదలైంది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన జయశీలన్, కొత్త తరహా కథను తెరపై చూపించారు. ప్రధాన పాత్రలో రూప కడువాయుర్ నటించగా, ఆమెతో పాటు నరేంద్ర, గీత కైలాసం, రాజు రాజప్పన్, హరిత, ప్రదీప్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. రూప కడువాయుర్ తెలుగు ప్రేక్షకులకు అంతగా పరిచయం లేదు. గతంలో కొన్ని చిన్న సినిమాల్లో నటించినా, పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ ‘యమకాతగి’ ద్వారా ఆమె తమిళ పరిశ్రమలో మంచి మార్కు కొట్టిందనే చెప్పాలి. ఈ సినిమాకు శ్రీనివాసరావు, గణపతి నిర్మాతలుగా వ్యవహరించగా, సంగీత దర్శకుడిగా జెసిన్ జార్జ్ తన ప్రతిభను చాటాడు. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒక ఊరి చివర ఉన్న మారుమూల గ్రామం నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. లీల అనే యువతి, తన కుటుంబంతో కలిసి అక్కడ జీవనం సాగిస్తోంది. అయితే ఓ రోజు హఠాత్తుగా కుటుంబ సభ్యులకు ఆమె ఉరితీయబడిన స్థితిలో కనిపిస్తుంది. అందరూ శోకసంద్రంలో మునిగి, అంత్యక్రియలకు సిద్ధమవుతారు. కానీ ఆశ్చర్యకరంగా, శవాన్ని ఇంటి వెలుపలికి తీసుకెళ్లే ప్రయత్నాలు విఫలమవుతాయి. ఎంత ప్రయత్నించినా శవాన్ని కదల్చలేరు. ఊరంతా భయంతో కంగారుపడుతుంది. ఇంతకు దీనికి కారణం ఏమిటి? లీల నిజంగా మృతిచెందిందా? లేదా మిస్టరీ ఏమైనా ఉందా? అనే ప్రశ్నలకు సమాధానం కావాలంటే సినిమా చూడాల్సిందే. సాంకేతికంగా ఆకట్టుకున్న సినిమా ఓ చిన్న బడ్జెట్ సినిమాగా వచ్చినా, టెక్నికల్ అంశాల్లో మాత్రం ‘యమకాతగి’ ఏమాత్రం తగ్గలేదు. కెమెరా పనితనం, ఎడిటింగ్, విజువల్స్%ఖశ్రీశ్రీ అమ్ఘ్ ఖఅఽ స్రతీఱజూజూఱఅస్త్ర%. థ్రిల్లింగ్ మూమెంట్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. రాత్రి సన్నివేశాల్లో హర్రర్ ఎలిమెంట్స్ బాగా వర్కౌట్ అయ్యాయి. ఇప్పటికే ‘ఆహా తమిళ్’ ద్వారా ఎన్నో విభిన్నమైన చిత్రాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పుడు ‘యమకాతగి’ కూడా ఆ జాబితాలో చేరింది. హర్రర్, థ్రిల్లర్ అభిమానులకు ఇది తప్పక చూడాల్సిన సినిమా. కథన శైలిలోనూ, భావప్రాప్తిలోనూ ఈ సినిమా ప్రత్యేకతను చూపించగలిగింది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339